



...అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష!




మనలను వదలక, అనుసరించి, అనుసరించి, వెంటాడి పట్టుకునేదే గురుకృప

# గురుకృప

ఆరాధనోత్సవ సంచిక 2011






అన్ని విధముల తానే భగవంతుడనని, సర్వాంతర్యామినని, అనుగ్రహించినను,
మానవాకారమున మనతో తిరుగుచున్నంత మాత్రమున భక్తుడని, సత్పురుషుడని,
జ్ఞాని అని, మహాత్ముడని కుంచిత బుద్ధితో తర్కించుట, సందేహించుట పరమ మౌఢ్యము.

సంపుటి : 14
జనవరి 1

సంచిక : 1
2011

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

సాయి వినీలాకాశంలో సద్గురుచంద్రుడు 4
- ఉపేంద్ర

శ్రీసాయి సజీవుడే! 12
- శ్రీసాయినాథచరిత్ర

నేనెప్పుడూ ఇక్కడే ఉంటాను 13
- భగవాన్ రమణుల చరిత్ర

పత్రికలో పదముద్రలు 18
- గురుకృప

తగ్గేందుకు మందులేదు... తగ్గక దారిలేదు 23
- ఎస్.సి.హెచ్.బి.కె. గుప్త

మూలానికి మూలం... ప్రేమ కరవాలం 36
- డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# సాయి వినీలాకాశంలో సద్గురుచంద్రుడు



13 నవంబరు 2010 శనివారం. మధ్యాహ్నం 1 గం.51 నిమిషాలకు పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ మహాసమాధి చెందారు. చైతన్యం ప్రకృతిలో లీనమైపోయింది. సాయితత్త్వ అంబరంలో అనన్య ప్రేమవెన్నెల కురిపించిన 'శరశ్చంద్రుడు' కాలమబ్బుల చాటుకు వెళ్లిపోయాడు. సాయిభక్త అంబరం కాంతి విహీనమయ్యింది. అంతవరకు వెన్నెల్లో ఆనందంగా నర్తిస్తున్న తారలు దిగాలుపడి కూలిపోయాయి. పూజ్య శ్రీబాబూజీ మహాసమాధి చెందారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న గురుబంధువులకు క్షణాల్లో చేరిపోయింది. భక్తుల గుండెచప్పుడు లయతప్పింది. భక్తులందరూ హతాశులయ్యారు. నమ్మలేకపోయారు, దిగ్భ్రమానికి లోనయ్యారు. ఎన్నో జీవితాలకు ఊపిరిలూదిన ఆ రూపం, దర్శనాలకే ఆదర్శమైన రూపం ఇక కనుమరుగవుతుందనే సరికి ఒక్కసారిగా తీవ్రవేదనతో మనస్సులు బరువెక్కాయి. సాయిభక్తలోకం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. తాము అనాథలైపోయామన్న భావం కలిగింది. జీవితాల్లో అకస్మాత్తుగా అంధకారం అలముకున్నట్లు అనిపించింది. ఇంతకాలం తమకు అన్నీ తానై నిలిచిన ఆ మహాత్ముడు భౌతికంగా ఇకలేరు అన్న భావన కుదిపివేసింది. ఇది కలా నిజమా అని అనుకున్నారు. తమను ఎంతగానో ప్రేమించి, తమ శ్రేయోభివృద్ధికై తపించి, తమను సాయిదరికి చేర్చడానికి పరితపించిన ఆ మహనీయులు లేని ఈ లోకంలో ఇంకా ఉండగలమా అనిపించింది. శ్రీబాబూజీ తమకు చేసిన మేలు, వారితో తమకు గల అనుబంధం, ప్రసాదించిన అనుభవాలు, మధుర జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆకాశం బద్దలై ప్రకృతి రోదిస్తున్నదా అన్నట్లు అదేరోజు రాత్రి శిరిడీలో విపరీతంగా గాలివానతో అకాల వర్షం పడింది.

జర్మనీలోని ముర్నావ్‌లో విదేహులైన శ్రీబాబూజీని కడసారిగా దర్శించుకోవాలని తలచి శ్రీబాబూజీని ఎప్పుడు, ఎక్కడకు తీసుకువస్తారని భక్తులు వాకబు చేయనారంభించారు. నవంబరు 16న శ్రీబాబూజీ పార్థివదేహాన్ని శిరిడీకి తీసుకుని వస్తారని తెలిసి అన్ని దారులు శిరిడీవైపుకు పయనమయ్యాయి. బాగా రద్దీగా వున్న ఆ సమయంలో అప్పటికప్పుడు శిరిడీకి బయలుదేరడానికి ఎక్కడా, ఏ ప్రయాణ సౌకర్యాలలోను ఖాళీలు లేవు. కానీ అవేమీ భక్తులు శిరిడీ వెళ్లడానికి అడ్డుకాలేదు. కొన్ని గంటల వ్యవధిలోనే కొందరు భక్తులు ప్రత్యేకంగా బస్సులు మాట్లాడుకున్నారు. మరికొందరు రిజర్వేషన్ లేకపోయినా, బాగా రద్దీగా ఉన్నప్పటికి రైలులో పయనమయ్యారు. పాస్‌పోర్టు, వీసాలకు సంబంధించిన ఎన్నో అవరోధాలు, మరెంతో వ్యయప్రయాసలతో కూడుకున్నా అవన్నీ సాయినాథుని అనుగ్రహ విశేషంగా అధిగమించి విదేశాల నుండి కూడా భక్తులు బయలుదేరారు. అందరికీ ప్రయాణం చేసేంతసేపు శ్రీబాబూజీకి సంబంధించిన ఆలోచనలే, వారి జ్ఞాపకాలే, వారిని గురించిన మాటలే.





చాలా కాలం ముందు నుండే శ్రీబాబూజీ తమ దేహ పరిసమాప్తి గురించి సూచనాప్రాయంగా చెబుతున్నప్పటికి అది ఎవరికీ ఆ కోణంలో అర్థంకాలేదు. ఈ సంవత్సరం జనవరి 1 అనంతరం శ్రీబాబూజీ దర్శనాలు, వారి సమక్షంలో వివాహాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు ఉండవని అది శ్రీబాబూజీ అభీష్టమని తెలిసి, వారు ఏకాంతంలో ఉండాలనుకుంటున్నారనే భక్తులు భావించారు. భక్తులు శ్రీబాబూజీని తమకు వారి దర్శనం ఎప్పటిలాగే కావాలని, తమను వదిలి వెళ్లవద్దని ప్రాధేయపడ్డపుడు ***'నేను మిమ్మల్ని ఎక్కడ వదులుతున్నాను, బాబా చేతుల్లోనే కదా!'*** అన్నారు. 'నేను ఉన్నా లేక పోయినా ఎప్పటిలాగే గురుపూర్ణిమ, విజయదశమి వేడుకలు సాయిపథంలో జరుగుతాయని, అలాగే జరగాలని' అన్నారు. శ్రీబాబూజీ అన్న మాదిరిగానే వారు భౌతికంగా ఉన్నపుడే 2010లో గురుపూర్ణిమ, విజయదశమి సమయాల్లో తాము శిరిడీకి రానప్పటికి యధాప్రకారం వేడుకలు జరిగేటట్లు చేసారు. గురుపూర్ణిమ అనంతరం శ్రీబాబూజీ శిరిడీకి వచ్చి కొన్ని రోజులు గడిపారు. మహాసమాధికి ముందు అక్టోబరు మాసంలో వరుసగా మొదట తమకు పసిప్రాయంలో జటాఝూటధారియైన మహాత్ముని దివ్యదర్శనం ప్రసాదించిన తిరుమల క్షేత్రంలో, అనంతరం తమ సాధన ఫలప్రదమైన పూండీస్వామి దివ్య సన్నిధిలో, చివరలో మరలా సమర్ధ సద్గురుక్షేత్రం శిరిడీలో గడిపారు. అక్టోబరు 27న శ్రీసాయిసమాధిని దర్శించుకుని, బాబా సమాధి మందిరంలో సాయిబాబా విగ్రహం ప్రక్కన గదిలో కొంతసమయం కూర్చున్నారు. అప్పటినుండి శ్రీబాబూజీ ధ్యానస్థితిలోనో లేక భిన్నమైన మనఃస్థితిలోనే ఉన్నట్లుగానో దగ్గరగా గమనించిన వారికి అనిపించింది. జర్మనీకి బయలుదేరడానికి కొన్నిరోజుల ముందు శ్రీబాబూజీ ఇంటిదగ్గర పనిచేసుకునే పిల్లలను పిలిపించి, నాలుగు సంవత్సరాల నుండి మీతో మాట్లాడదామని అనుకుంటున్నానని, ఇప్పటికి వీలయిందని చెప్పి, వారితో మాట్లాడారు. తన చిరకాల మిత్రుడిని పిలిపించి, జర్మనీ వెళ్లే రోజు మాట్లాడారు. మహాసమాధికి ముందు, ఆ తరువాత కొంతమంది భక్తులకు దివ్యస్వప్నాలు వచ్చి శ్రీబాబూజీ దివ్యదర్శనం కలిగింది. మహాసమాధికి కొద్దిరోజుల ముందే తమ అంతిమ విశ్రాంతి ప్రదేశాన్ని గురించి శ్రీబాబూజీ సేవకురాలు శ్రీమతి ఇవాన్ వయార్‌తో ప్రస్థావించారు. ఇలా అనేక విషయాలు క్రోడీకరించుకుని చూసిన భక్తులకు శ్రీబాబూజీ తమ మహాసమాధిని ముందే నిర్ణయించుకున్నారని అనిపించింది.

శ్రీబాబూజీని ఎప్పుడెప్పుడు దర్శించుకుంటామా అన్న ధ్యాసలో క్షణాలు భారంగా గడిచాయి. నవంబరు 14 ఆదివారం ఉదయం నుండే భక్తులు శిరిడీ సాయిపథానికి రావడం ఆరంభించారు. తమ సమాధిస్థానాన్ని శ్రీబాబూజీ ముందే సూచించారని తెలిసి భక్తులు శ్రీబాబూజీ సర్వజ్ఞతకు అబ్బురపడ్డారు. సాయియానా ఆవరణలో సత్సంగహాలు ప్రక్కన శ్రీబాబూజీ తమ సమాధి స్థానాన్ని సూచించిన ప్రదేశంలోనే అప్పట్లో మొట్టమొదట శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి





సాయిపథం నిర్మాణానికి పునాదిరాయి వేసారు. 1995లో శ్రీబాబూజీ అభీష్టానుసారం అమ్మగారు రోజుకి రెండుసార్లు, ఆ ప్రదేశంలో దీపారాధన చేయడం ఆరంభించారు. 2007 విజయదశమి పర్వదినాన సత్సంగహాలులో శ్రీబాబూజీ అఖండజ్యోతి ప్రజ్వలన చేసేంతవరకు నిరంతరంగా పన్నెండు సంవత్సరాలు అదే ప్రదేశంలో దీపారాధన జరిగింది. సరిగ్గా ఆ స్థలాన్ని శ్రీబాబూజీ తమ అంతిమ విశ్రాంతి ప్రదేశంగా సూచించడం ఆ మహితాత్ముని త్రికాలజ్ఞతకు నిదర్శనంగా భక్తులు భావించారు.

సాయిపథం ప్రాంగణంలోని ఆ స్థలంలోనే నవంబర్ 15 సోమవారం ఉదయం శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి పూజించారు. సత్సంగహాలులో సాయినామాన్ని ఆర్తిగా ఆలపిస్తుండగా, శ్రీబాబూజీ మహాసమాధి పవిత్ర కార్యానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు. మహాసమాధి స్థలంలో మట్టిని త్రవ్వడం ప్రారంభించారు. శ్రీబాబూజీకి అంతిమంగా చేసుకునే అవకాశం ఉన్న ఏకైక సేవగా భావించి, అంతకు ముందు పలుగు, పారలు పట్టని వారు సైతం ఆ సేవలో పాల్గొన్నారు. చిన్న, పెద్ద, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా, అందరూ సేవ చేసుకునేందుకు వీలుగా ఒకరికొకరు సహకరించుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చినవారు వచ్చినట్లు అంతిమసేవలో పాల్గొన్నారు. మనస్సులోతుల్లో పేరుకుపోయిన మలిన ఆలోచనల మట్టినితీసి, శ్రీబాబూజీ నివాసానికి అనుగుణంగా తమ హృదయాలు తీర్చిదిద్దుకుంటున్నామన్న దివ్య అనుభూతికి ఆ సేవలో పాల్గొంటున్నపుడు భక్తులు లోనయ్యారు. సుమారు 6×6×6 అడుగుల విస్తీర్ణంలో సమాధికోసం అర్ధరాత్రి వరకు ఆ ప్రదేశాన్ని త్రవ్వారు. కొందరు భక్తులు సిమెంట్, గులక, ఇసుకతో డ్రైమిక్స్‌ను కలిపారు. మరికొందరు సాయినామస్మరణ చేస్తూ సాయియానా ప్రాంగణం బయట నుండి సమాధి నిర్మాణ ప్రదేశం వరకు రెండు వరుసల్లో నిలుచుని, తమ ప్రేమనంతా దోసిలిగా పట్టి నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, డ్రైమిక్స్, సిమెంట్, ప్లాస్టర్ఆఫ్ పారిస్‌ను అందించారు. ఇంకొందరు డ్రైమిక్స్‌తో సమాధి అడుగుభాగంలో ఒకటిన్నర అడుగులు ఎత్తువరకు కప్పి చదును చేసారు. సమాధి అడుగుభాగం నుండి పై వరకు 'సత్' అని ముద్ర ఉన్న ఇటుకరాళ్లను పేర్చారు. సాయిపాద ధూళిగా భావించే సాయిబాబా ఊదీని, సిమెంట్‌తో కలిపి తమ ప్రేమే పునాదిగా సమాధి నిర్మాణం కట్టారు. చెట్ల వేర్ల వల్ల ఆ సమాధి కట్టడానికి భవిష్యత్తులో ఇబ్బందులు కలగరాదని భావించి, సమాధి లోపల చుట్టూ గ్రానైట్ రాయిని పరిచారు. మొదట శ్రీబాబూజీ పవిత్ర దేహాన్ని ఉంచే ప్రదేశాన్ని 2×6×2 అడుగుల విస్తీర్ణంలో గ్రానైట్‌తో నిర్మించారు. ఆ తరువాత శ్రీబాబూజీ దేహాన్ని ఉంచే ప్రదేశం శిరిడీ నేల తాకాలని భావించి ఆ ప్రదేశంలో అంతకుముందు పరచిన గ్రానైట్‌ని క్రిందభాగం మాత్రం పగులగొట్టి శిరిడీ నేల తాకేంతవరకు త్రవ్వారు. సమాధి ప్రాంగణాన్ని కప్పుతూ షెడ్ ఏర్పాటు





చేసారు. నవంబరు 15 సోమవారం ఉదయం నుండి మొదలైన సమాధి నిర్మాణ కార్యక్రమం మంగళవారం వరకు కొనసాగింది. తమ జీవితమంతా సాయిసేవలో గడిపి, సాయిభక్తుల శ్రేయోభివృద్ధికై అవిశ్రాంతంగా పరితపించిన ఆ మహాత్ముని తన పొత్తిళ్లలో చేర్చుకొని విశ్రాంతి కల్పించే భాగ్యం కలిగినందుకు పుడమితల్లి పులకించి ఉంటుంది.

శ్రీబాబూజీ పార్థివదేహం జర్మనీ నుండి ముంబాయికి సోమవారం అర్థరాత్రి (తెల్లవారితే మంగళవారం) ఒంటిగంట రెండుగంటల మధ్య చేరుకుంది. నవంబరు 16 మంగళవారం మధ్యాహ్నానికి శ్రీబాబూజీని శిరిడీకి తీసుకువస్తారని తెలిసి, భక్తుల సందర్శనార్థం ఉంచడానికి వీలుగా సత్సంగహాలులో తగిన ఏర్పాట్లు చేసారు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో భక్తులు రెండు వరుసల్లో నిలబడి, సాయినామం ఆలపిస్తూ, శ్రీసాయి నడచిన బాటలో ఊరేగింపుగా శ్రీబాబూజీని ఆహ్వానించేందుకు శిరిడీ –కోపర్‌గాం దారిలో శిరిడీ పొలిమేరల వరకు వెళ్లారు. శ్రీబాబూజీ పవిత్రకాయాన్ని తీసుకొని వచ్చే వాహనాన్ని అలంకరించేందుకు పూలు తీసుకుని మరికొందరు భక్తులు కోపర్‌గాం–నాసిక్ రహదారికి ముందే చేరుకున్నారు. శిరిడీ పొలిమేర వద్ద పోలీస్‌స్టేషన్ కూడలి దగ్గర ఉన్న ఖాళీ ప్రాంగణంలో అందరూ కలసి సాయిబాబా, సాయిబాబా అని ఎలుగెత్తి పిలుస్తూ, తమలోని వేదనను సాయినామంగా ఆలపిస్తూ, శ్రీబాబూజీ రాకకోసం వేయికళ్లతో ఎదురుచూడసాగారు. శ్రీబాబూజీ వచ్చే ముందుగా అదే సమయంలో సాయిభక్తుల పాదయాత్రా బృందాలు అనేకం ఒకదాని వెంట మరొకటి అదే మార్గంలో వచ్చాయి. సాయిని పల్లకీలో ఊరేగిస్తూ, బ్యాండ్ మేళాలు వాయిస్తూ, భిన్న వస్త్రధారణతో నృత్యం చేస్తూ భక్త బృందాలు వస్తుంటే ఎంతో మనోహరంగా ఉంది. అది చూసిన వారికి శ్రీబాబూజీని ఎంత శోభాయమానంగా బాబా తమ సన్నిధికి ఆహ్వానిస్తున్నారా అనిపించింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో శ్రీబాబూజీ పార్థివదేహం శిరిడీ పొలిమేర చేరగానే భక్తుల హృదయరోదన మిన్నునంటింది. పెద్దగా ఒక్కపెట్టున భక్తులు విలపించారు. ఆ గద్గద స్వరాలతోనే శక్తినంతా కూడగట్టుకొని సాయినాథ్ మహరాజ్‌కీ జై, సద్గురు సాయినాథుని శరత్‌బాబూజీకీ జై అని నినదించారు. అసంఖ్యాక భక్తులతో శిరిడీ పురవీధులు భక్త జన సంద్రమయ్యాయి. ఆ భక్తజన సంద్రం మధ్య శ్రీబాబూజీ పవిత్ర భౌతికకాయం ఉన్న అంబులెన్స్ వాహనం ఓ పుష్పకవిమానంలా అనిపించింది. కనుచూపుమేర ఎక్కడ చూసినా భక్తజనం. అడుగుతీసి అడుగు వేయడానికి వీలు లేనంతగా భక్తులతో ఆ వాహనానికి ఇరువైపులా దారంతా కిక్కిరిసిపోయింది. శ్రీబాబూజీని దర్శించుకోవాలని వాహనం కిటికీల గుండా చూసేందుకు భక్తులు ప్రయత్నిస్తున్నారు. కనీసం వాహనమైనా తాకి నమస్కరించు కోవాలని విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. పూలతో, పూలమాలలతో ఆ వాహనాన్ని ముంచెత్తుతున్నారు. శ్రీబాబూజీ వెంట శిరిడీ రహదారుల్లో





భక్తులందరూ కలసి పయనించే మొదటి, చివరి యాత్ర అది. ఆ అంతిమయాత్ర బాబా మందిరం ప్రధాన ద్వారం (ఒకటో నెంబర్ గేట్), గురుస్థాన్ వద్ద నున్న మరో ద్వారం మీదుగా కదిలి సమాధి మందిరం దగ్గరకు చేరింది. బాబా సమాధికి కుడివైపున ఉన్న ఐరన్ మెష్ దగ్గర శ్రీబాబూజీ ఉన్న వాహనాన్ని కొన్ని క్షణాలు నిలిపారు. బాబా తనలో కలుపుకున్న ముద్దుబిడ్డను ప్రేమలోగిలికి తీసుకున్నట్లనిపించింది. నెమ్మదిగా ఆ వాహనం మరలా మసీదుమాయి (ద్వారకామాయి) దగ్గర ఆగింది. మసీదుమాయి తన బిడ్డను అక్కున చేర్చుకున్నట్లు అనిపించింది. బాబా–బాబూజీల సమాగమానికి ఆ అంతిమ యాత్రే వేదికయింది. ద్వారకామాయి బాబా దగ్గర సెలవు తీసుకుని ముందుకు సాగిన ఆ యాత్ర చావడి, హనుమాన్ మందిరం, ముఖదర్శనం గేట్ మీదుగా పింపుల్‌వాడి రోడ్‌కు చేరుకుంది. శిరిడీ పురజనులు, శిరిడీకి వచ్చిన భక్తులు సైతం ఆ మహాత్ముని చూడాలని ఆతురత పడ్డారు. వారు బాబా కోసమని తెచ్చుకున్న గులాబీ పూలను ఆ వాహనం పైకి విసిరారు. శిరిడీ పురవాసులు శ్రీబాబూజీ పవిత్ర కాయానికి దారిపొడవునా ఆరతులిస్తూ కనబడ్డారు. మహాత్ముని అంతిమయాత్రలో పాల్గొనడం సుకృతంగా భావించి, వారు కూడా అందరితో కలసి ఆ యాత్రలో అడుగులు కలిపారు. కొందరు వికలాంగులు వీల్‌ఛైర్లో అంతటి రద్దీలో ఆ అంతిమ యాత్రలో పాల్గొనడం చూసిన భక్తులు శ్రీబాబూజీ పట్ల వారికున్న ప్రేమకు కదిలిపోయారు. సాయి నడిచిన మార్గం 'సాయిపథాన్ని' చూపి, భక్తులను ఆ పవిత్ర మార్గంలో పయనింప చేయాలని పరితపించిన ఆ మహితాత్ముని వెంటసాగిన ఆ అంతిమ యాత్ర సాయిపథం ప్రాంగణానికి చేరుకుంది.

వాహనాన్ని సత్సంగహాలు ప్రక్కనే ఆపారు. ఆ వాహనం నుండి శ్రీబాబూజీ పవిత్రదేహం వున్న పేటికను తీసి, అప్పటికే వేసిన బల్లలపై జరుపుకుంటూ సత్సంగహాలు మధ్య శ్రీబాబూజీ తల భాగం సమాధిమందిరంవైపు ఉండే విధంగా ఉంచారు. అప్పటివరకు పేటిక వాహనంలోపలే ఉండడం వల్ల శ్రీబాబూజీ పార్థివదేహాన్ని అందరూ దర్శించుకునే అవకాశం సత్సంగహాలులోనే కలిగింది. 'సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ కీ జై' అని ఆ ప్రాంతమంతా మార్మోగింది. శ్రీబాబూజీని దర్శించుకోకుండా ఇక ఒక్క క్షణం కూడా వేచి ఉండలేమని భక్తులకు అనిపించింది. సత్సంగహాలు ప్రాంగణం కిక్కిరిసింది. షార్ట్ సర్క్యూట్ టివిలు అమర్చడంతో వాటి ముందు పెద్ద సంఖ్యలో భక్తులు గుమిగూడారు. పేటికలో వున్న శ్రీబాబూజీని అలా దర్శించుకోగానే దుఃఖం పొంగి పొర్లింది. దివ్య తేజస్సుతో నిండిన శ్రీబాబూజీ వదనాన్ని దర్శించాలని కన్నీటితో నిండుతున్న కళ్లను పదే పదే తుడుచుకుంటూ భక్తులు చూస్తున్నారు. శ్రీబాబూజీ తల కొంచెం ప్రక్కకు వాల్చినట్లుగా ఉంది. తల ప్రక్కన శ్రీసాయిబాబా ఫొటో ఉంది. శ్రీబాబూజీ దీర్ఘనిద్రలో ఉన్నట్లనిపించింది. ప్రశాంతంగా ఉన్న శ్రీబాబూజీ





వదనాన్ని చూస్తుంటే ముగ్ధమైన సౌందర్యాన్ని, సమ్మోహన రూపాన్ని చూస్తున్న అనుభూతి కలిగింది.

శ్రీబాబూజీ విదేహులై అప్పటికే మూడురోజులు కావస్తున్నప్పటికి శరీరధర్మాన్ని అనుసరించి జరిగే మార్పులేవీ ఆ పవిత్రకాయంలో కనపడలేదు. మశీదుమాయి (ద్వారకామాయి) నుండి పూలమాలను బాబా ప్రసాదంగా శ్రీబాబూజీ భౌతికకాయానికి అలంకరించడానికి పంపారు. పూలమాలను వేసి శ్రీబాబూజీ కుమార్తె నమస్కరించుకున్నారు. శ్రీబాబూజీ తల్లిదండ్రులు శ్రీసురేంద్రబాబు, వెంకటరత్నమ్మ పుణ్యదంపతులు, రక్తసంబంధీకులు శ్రీబాబూజీని దర్శించుకుంటుంటే అది చూసి భక్తులకు దుఃఖమాగలేదు. శ్రీబాబూజీని దగ్గరగా దర్శించుకోవడానికి భక్తులు సత్సంగహాలు నుండి సాయి చరణ్ వరకు బారులు తీరారు. ఒకవైపు భక్తులు ప్రేమతో పూలు, పూమాలలు తెచ్చి, ఆ మహాత్ముని ఉంచిన పేటికను అలంకరించుకుంటున్నారు. మరోవైపు శ్రీబాబూజీని స్పష్టంగా దర్శించుకోవడానికి వీలుగా ఆ పూలమాలలను తీసి, పేటికపై గ్లాసును తుడుస్తున్నారు. భక్త ప్రభంజనం ఎంతగా ఉందంటే ఒక్కొక్కరికి శ్రీబాబూజీని దర్శించుకోవడానికి 4 నుండి 5 గంటలకు పైగా సమయం పట్టింది. శ్రీబాబూజీ ప్రసాదించిన అనుభవాలను, మిగిల్చిన జ్ఞాపకాలను తలచుకొని, తలచుకొని భక్తులు విలపించారు. ఆ మహాత్ముని, ఆ దివ్య సన్నిధిని సరిగా వినియోగించుకోలేక పోయామని చాలా మంది భక్తులు చింతించారు. ఆ మహాత్ముడు చెప్పిన విధంగా తాము సరిగా నడచుకోనందుకు, ప్రవర్తన మారనందుకు బాధపడ్డారు. ఎన్నో దివ్య అనుభవాలను ప్రసాదించి, వెతలు, వేదనలను తీర్చిన ఆ రూపాన్ని ఇక దర్శించుకోలేమని దుఃఖిస్తూ, చివరిసారి దగ్గరగా శ్రీబాబూజీని మరలా మరలా చూసుకుంటూ, వదలలేక వదలలేక వెళుతున్నారు. జీవిత చరమాంకం వరకు తోడుగా మీరే ఉండాలి. జన్మజన్మలకు మీరే మా సద్గురువై నడిపించాలని ప్రార్థిస్తూ శ్రీబాబూజీని వేడుకుంటున్నారు. అంతరంగం నుండి పొంగిన ప్రేమ, మరోవైపు వేదన కంటి సరిహద్దు దాటి కన్నీరై ఉప్పొంగుతున్నాయి. కన్నీటి తెరల మాటున గతకాలపు స్మృతులు గుర్తుకు వచ్చి మనస్సులు మూగబోయాయి. ఆ మహితాత్ముని సన్నిధిలో భక్తుల అంతరంగ దృశ్యం వర్ణనాతీతంగా ఉంది. శిరిడీలోనే ఉండి సాధన చేసుకునే సంత్‌లు, శిరిడీ పురప్రముఖులు, సంస్థాన్ వారు ఇలా చాలా మంది స్థానికులు శ్రీబాబూజీని దర్శించుకుని నివాళులర్పించారు. అర్ధరాత్రి మూడు గంటలు దాటినా క్యూ ఏ మాత్రం తగ్గలేదు. రాత్రంతా భక్తులు సాయినామస్మరణ చేసుకుంటూ శ్రీబాబూజీ పవిత్ర సన్నిధిలోనే గడిపారు. ఆరోజు అర్ధరాత్రి నుండి తెల్లవారుఝాము వరకు చంద్రునిలో కొందరు శిరిడీవాసులకు ద్వారకామాయిలో వున్న బాబా చిత్రపటంలో మాదిరిగా ద్వారకామాయి బాబా కనిపించారు. అది చూసి శిరిడీ స్థానికులు శ్రీబాబూజీ గొప్ప మహాత్ములని, శ్రీబాబూజీ మహాసమాధి దగ్గర మరెన్నో అనుభవాలు కలుగుతాయని అనుకున్నారు.





నవంబరు 17 బుధవారం ఉదయమైనా భక్త సందోహం తగ్గకపోవడంతో రెండు లైన్లలో శ్రీబాబూజీని దర్శించుకునే ఏర్పాటు చేసారు. బుధవారం ఉదయం 10.30 గంటల వరకు శ్రీబాబూజీని భక్తులు దర్శించుకుంటూనే ఉన్నారు. చివరలో శ్రీబాబూజీ తల్లిదండ్రులు, బంధువులు ఆ భౌతిక కాయానికి ప్రదక్షిణ చేసి నమస్కరించుకున్నారు. 11 గంటల నుండి శ్రీబాబూజీ సమాధి వద్ద ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. శ్రీబాబూజీ నిలువెత్తు చిత్రపటాన్ని సమాధి వెనుక పూలతో అందంగా అలంకరించారు. ఎవరు చేయగలిగిన పనిలో వారు నిమగ్నమయ్యారు. 12 గంటల ప్రాంతంలో శ్రీబాబూజీ కుమార్తె సాయినాథుని శృతి సమాధి ప్రాంగణానికి వచ్చారు. సమాధి ఎడమవైపున ఏర్పాటు చేసిన మెట్ల ద్వారా లోపలికి దిగి సమాధికి ముందు అవసరమైన వాటిని సమకూర్చడం ప్రారంభించారు. శ్రీబాబూజీ సేవకురాలు శ్రీమతి ఇవాన్ వయార్ సాయినాథుని శృతికి సహకరించారు. మొదట ఊదీ, కర్పూరం, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని శ్రీబాబూజీ పవిత్ర దేహాన్ని ఉంచే ప్రదేశపు అడుగు భాగాన పరిచారు. దానిపై గురుస్థాన్ దగ్గర వున్న వేపచెట్టు నుండి రాలిపడిన సమిధలను అన్ని ప్రక్కల ఉంచారు. గంధపు చెక్కలను రెండు ప్రక్కల పెట్టారు. శ్రీబాబూజీ దేహాన్ని ఉంచినపుడు క్రింద మెత్తగా ఉండడానికి దూదితో అక్కడంతా కప్పారు. అనంతరం సాయిబాబా సంస్థాన్ వారు శ్రీబాబూజీకి బాబా ప్రసాదంగా ఇచ్చిన శాలువాను పరిచారు. దానిమీద ధవళ వస్త్రాన్ని కప్పారు. తలవైపు శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచారు. సాయిబాబా పాదాల దగ్గర తలగడ ఉంచారు. శ్రీసాయిబాబా సశరీరులై ఉన్నపుడు సన్నిహిత భక్తులకు స్వయంగా ఇచ్చిన ఊదీకి, ధుని నుండి వచ్చిన ఊదీతో కలిపి పంచగా, ఆ ఊదీని శ్రీబాబూజీకి బాబా ప్రసాదంగా సమర్పించారు. అలా బాబా స్వయంగా ఇచ్చిన ఊదీని సమాధిలో ఉంచారు.

12.30 గంటలకు శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి అనసూయమ్మ (అమ్మగారు) శ్రీబాబూజీని దర్శించుకున్నారు. అంతటి వేదనలోను కన్నీళ్లను దిగమింగి, శక్తిని కూడదీసుకుని ఆ తల్లీతనయలు శ్రీబాబూజీ మహాసమాధికి అవసరమైన ఏర్పాట్లను చూసుకున్నారు. అనంతరం భక్తుల సాయినామాలాపన మిన్నునంటగా శ్రీబాబూజీ దేహాన్ని పేటికపై నుండి తీసి ప్రక్కనే ఏర్పాటు చేసిన బల్లపై ఉంచారు. ఊదీ, పన్నీరు కలిపిన నీరు భక్తులు అందించగా ఆ పార్థివ దేహానికి అమ్మగారు, శృతిపాప మంగళస్నానం చేయించారు. మెత్తటి తువాలుతో శ్రీబాబూజీ దేహాన్ని, తలను అమ్మగారు తుడిచారు. ఆపై శాలువా, మెత్తని వస్త్రం కప్పారు. భక్తులు గద్గద స్వరంతో సాయిబాబా నామాన్ని ఆలపిస్తూ జయజయధ్వానాలు చేస్తూ ఉండగా, శ్రీబాబూజీ దేహాన్ని పట్టుకుని అక్కడున్న భక్తులు సమాధిలో ఉంచారు. శ్రీబాబూజీకి తమ సాధనా ప్రస్థానంలో పూండీస్వామి తదితర మహాత్ములు ప్రసాదించిన వస్తువులను, జపమాలను అమ్మగారు అందిస్తుండగా, శృతిపాప వాటిని శ్రీబాబూజీ దేహానికి ఓ ప్రక్కగా





ఉంచారు. కేదారనాథ్ వద్ద ఒక పూజారి దైవానికి నివేదించిన బ్రహ్మకమలాన్ని, శ్రీబాబూజీకి భక్తితో సమర్పించారు. ఆ పుష్పాన్ని శ్రీబాబూజీ హృదయంపై శృతిపాప ఉంచి నమస్కరించుకున్నారు. కడసారిగా అందరూ శ్రీబాబూజీని దర్శించుకున్నారు. అమ్మగారు, శృతిపాప శ్రీబాబూజీకి నమస్కరించుకుని ధవళవస్త్రాన్ని శ్రీబాబూజీ తలవరకు నిండుగా కప్పారు. ఊదీ కలిపిన మిశ్రమాన్ని అమ్మగారు, శృతి శ్రీబాబూజీ దేహంపై విడిచారు. అనంతరం అందరు భక్తులు బారులు తీరి శ్రీబాబూజీపై ఊదీ కలిపిన మిశ్రమాన్ని విడిచి నమస్కరించుకున్నారు. ***భక్తుల మనోవేదనలను బాపిన రూపం, జీవితాల్లో ఆనందాన్ని నింపిన రూపం, సాయిమార్గాన్ని చూపిన రూపం, సాయి నిజతత్త్వాన్ని దర్శింపచేసిన రూపం, వ్యధార్తులకు కొండంత అండగా నిలిచిన సాయిరూపం, సాయి అనుగ్రహానికి ప్రత్యక్ష సాక్ష్యమై నిలిచిన రూపం, సాయి ప్రేమకు నిలువెత్తు నిదర్శనమై నిలిచిన రూపం... ఇక కనుమరుగైపోయింది. ఆనందసాయిలో లయమై, ప్రేమించే ప్రతి భక్తుని హృదయంలో నిలిచి పోయింది.***

మొదట శ్రీబాబూజీ మహాసమాధి కార్యక్రమాన్ని నవంబరు 16, మంగళవారం సాయంత్రమే చేయాలని నిర్ణయించినా, భక్తుల రద్దీ వల్ల అందరూ దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో నవంబరు 17, బుధవారం వరకు వేచి ఉండవలసి వచ్చింది. కాకతాళీయంగా శ్రీబాబూజీ పవిత్ర దేహాన్ని శిరిడీలో సమాధి చేసిన రోజు కార్తీకమాసం ఏకాదశి పర్వదినం, అదేరోజు ముస్లింలకు పవిత్రమైన బక్రీద్ కావడం విశేషం.

సాయిభానుడు అస్తమించాడు. సాయంసంధ్య వేళ సాయంత్రం 6.30 గంటలకు అమ్మగారు శ్రీబాబూజీ మహాసమాధికి ప్రప్రథమంగా ఆరతినిచ్చారు. అమ్మగారు తమ పంచప్రాణాలను జ్యోతులుగా చేసి, శ్రీబాబూజీకి మంగళ నీరాజనాలర్పించారు. ఆ మహాసమాధి దేదీప్యమానంగా దివ్యమైన శోభతో ప్రకాశిస్తోంది. ఆ సన్నిధిలో మానసిక ప్రశాంతత అప్రయత్నంగా అనుభవమవుతోంది. మహాసమాధి చెంత నిత్య ప్రార్థన, సాయినామ ఆలాపన, అనంతరం సత్సంగం జరిగాయి. తల్లడిల్లిన ప్రకృతి భోరున విలపించినట్లుగా ఆరోజు రాత్రి విపరీతంగా వర్షం కురిసింది.

మరుసటి రోజు నవంబరు 18 గురువారం. శ్రీబాబూజీ సశరీరులుగా కనిపించని మొదటిరోజు. సాయిభానుని నునులేత కిరణాలు సాయిసమాధి మందిరాన్ని తాకి, సాయిని దర్శించుకుని, శ్రీబాబూజీ సమాధిపై పరావర్తనం చెందుతున్నట్లు ఆ సమాధి శోభాయమానంగా ఉంది. ఉదయం 8.30 గంటలకు అమ్మగారు శ్రీబాబూజీ మహాసమాధికి ఆరతినిచ్చారు. ఆ రోజు కొందరు భక్తులు శ్రీబాబూజీ సమాధి మందిర నిర్మాణం గురించి చర్చించుకుంటున్నారు. ప్రస్తుతానికి సమాధిని కొంచెం ఎత్తువరకు పెంచాలని భావించి, అదేరోజు రాత్రి దానికి తగిన ఏర్పాట్లు చేసారు. భక్తులందరూ





సాయినామాన్ని ఆలపిస్తూ, సమాధి నిర్మాణ సేవలో పాల్గొన్నారు. ఆ సేవ చేసుకుంటున్నంతసేపు భక్తులకు శ్రీబాబూజీ సశరీరులుగా లేరన్న భావన మరుపులోకి నెట్టబడి, ఓ దివ్య అనుభూతికి లోనయ్యారు.

***మహాత్ములు దేహాతీతులు. వారు దేహాన్ని త్యజించిన అనంతరం వారి మహిమ ఇంకా విస్తృతంగా ప్రకటమవుతుంది. ఎందుకంటే దేహానికి పరిమితులుంటాయి ఆ పరిమితులు దాటితే వారు అపరిమితులు. అనంతులు.*** వారు చూపిన సన్మార్గంలో పయనించే ప్రతి ఒక్కరికి వారి దివ్య సన్నిధి అనుభవమవుతునే ఉంటుంది. అందుకు రమణీయమైన శోభతో అలరాడుతున్న శ్రీబాబూజీ మహాసమాధిని దర్శించుకుంటున్న భక్తులు పొందిన, పొందుతున్న అనుభవాలే నిదర్శనం. పూజ్య గురుదేవులు శ్రీబాబూజీ అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ మనతోనే ఉన్నారు, ఉంటారన్నది భక్తుల అనుభవం.

ఓ సద్గురూ! మీ ఎడబాటును భరించలేక జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్న మాకు మీ ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని ప్రతిక్షణం ప్రసాదించు. మీ ప్రేమను నిత్యం మాపై కురిపించు. మీ కరుణా దృక్కులను నిరంతరం ప్రసరించు. మీ సన్నిధానాన్ని అందరికీ అనుక్షణం అనుగ్రహించు.

***– ఉపేంద్ర, 'ఉన్నమాట–అనుకున్నమాట'*** కోసం

## శ్రీసాయి సజీవుడే!

శ్రీసాయి సజీవుడే! త్యజించినది భౌతిక శరీరమును మాత్రమే! ఆ తండ్రి నిర్యాణమయ్యెనని వాపోవుట వట్టి భ్రమ! 15–10–1918న శ్రీసాయి శరీరత్యాగ మొనరించెను గదా, కాని ఆనాటి రాత్రి మన తండ్రి శ్రీలక్ష్మణ్ మామ జోషికి అగపడి నిదురించు అతని చేయిపట్టి లాగి, "ఇంకనూ నిద్రయేనా లెమ్ము! తెల్లవారుచున్నది, త్వరపడుము!!. శ్రీబాపూసాహెబ్, నేను మరణించితిననియే తలంచుచున్నాడు. అతడు ఉదయమున పూజ గావింపడు. నాకడ ఆరతినియ్యడు. నీవు వేగిరపడిరమ్ము. 'నాకు మరణమెక్కడిది?' నేను మరణించలేదు. నేను సజీవుడనే! నాకడ ఆరతినిచ్చి, యధారీతి పూజగావింపవలదినది" అని స్పష్టమగు వాక్కులతో చెప్పెను. లక్ష్మణ్ మామ శ్రోత్రియ బ్రాహ్మణుడు. శ్రీసాయి భగవదవతారమన్న ధృఢవిశ్వాసము గల భక్తుడు.

ఆ రాత్రి శ్రీసాయి దర్శనమైనంతనే ఉదయమగు సరికి యధావిధి పూజాద్రవ్యములనుగొని మశీదు చేరినాడు. శ్రీసాయి శరీరము తాకవలదని అచ్చటి మౌల్వీలు అడ్డుపెట్టుచున్నను, లక్ష్య పెట్టక, "సోదరులారా! మనసాయి మరణించెనని భ్రమపడెదరేల? శ్రీసాయి సజీవుడే! నన్నాపకు"దని





శ్రీసాయి పాదముల పూజించినాడు. ఆరతిని శాస్త్రోక్తముగా జరిపినాడు. "జయ, శ్రీసమర్థ సద్గురు సాయినాధ మహారాజునకు జయ!" అని జయజయ ధ్వనులు చెలరేగినవి. నాటి మధ్యాహ్నము బాపూసాహెబ్, పూజగావించి, ఆరతిని చేసినాడు. అంతటితో సాయి తమ సమీపమందే యున్నట్లు విశ్వాసమలవడినది. సృష్టి మొదలు, సృష్టి అంతయూ, తానేయై వెలసిన, శ్రీసాయికి మరణమెక్కడిది? సాయిని చేరి భక్తులు "తండ్రీ! మాగతియేమి? మమ్మేమి చేసి పోదలంచితి" వని వాపోయినపుడు శ్రీసాయి సాదరముగా "బిడ్డలారా! ఇన్నాళ్లు నాయొద్ద యుండి కూడా నిజమును గ్రహింపలేదా? సాయియన్న ఈ శరీరము మాత్రమనియే భ్రమపడు చుంటిరా? ఎన్నియో విధముల ఈ శరీరముతో పనిలేదని నేనే పరమాత్మ స్వరూపమని – ***శరీరమున్ననూ, లేకున్ననూ, నేను నా భక్తుల వెంటనే యుందునని మీకు తెలియచెప్పితిని. నిర్ధష్టముగా నిరూపించి చూపితిని గదా! ఇంకనూ అజ్ఞానమున ఇట్లు వాపోదురేల? సమాధినుండియే మీకు సమాధానమీయగలను. ఈ శరీరము లేదన్న బాధపడకుడు! శరీరముతో వున్నపుడు నన్ను దర్శించుటకు మీరు పనిబడి ఈ షిర్డి చేరెడివారు! నిర్యాణానంతరము మీరెక్కడ నన్ను తలంచిన అక్కడనే సర్వాంతర్యామినైన నన్ను చూడగలరు! భయపడకుడ"ని అభయమిచ్చెను.*** సమాధి అనంతరమే శ్రీసాయి ఇంకనూ తన మహిమల విరివిగా చూపుతున్నాడు. శ్రీసాయి సమాధినుండి సమాధానమిచ్చుటయే గాక, వివిధ ప్రదేశముల వివిధ రూపముల భక్తుని అర్హతననుసరించి అనుగ్రహించి దర్శనమిచ్చుచున్నాడు. శ్రీసాయి సమాధి సందర్శనము మహద్భాగ్యము. ఆ తండ్రి పదభక్తిని ప్రసాదింపుమని ప్రణమిల్లుదము.

– ***శ్రీసాయినాథచరిత్ర నుండి***

## నేనెప్పుడూ ఇక్కడే ఉంటాను

జన్మ ఎత్తిన వారెవరయినా సరే ఆ జన్మను ఎపుడో ఒకప్పుడు ముగించాల్సి ఉంటుంది. మామూలు మానవ వ్యవహారంలో జన్మ ఎత్తడం అంటే శరీరంలోకి రావడం, దాన్ని ముగించడమంటే శరీరాన్ని వదిలి వేయడం. ఇది ఎవరికైనా తప్పదు. అవతార పురుషుల దేహాలకూ ఈ అంతిమ సంస్కారం జరుగుతుంది. పరమ పవిత్రమైనవే అయినప్పటికి వారు దేహాన్ని వదిలేశాక వారికి ఆ దేహం పాంచభౌతిక ద్రవ్యాలతో సమానమే. అయితే వారు వదిలిన దేహాలలో చిత్‌శక్తి ఉండి సహస్రానేకవత్సరాలు సాధకులకు ఆధ్యాత్మికంగా ప్రయోజనం చేకూరుస్తున్నవి. కాబట్టే వారి శరీరాలను దహనం చేయకుండా, సమాధి చేయడం జరుగుతోంది. ముక్త పురుషులు, జ్ఞానుల దేహాలు ఇలాగే సమాధి కావింపబడ్డాయి. ఈ జన్మ ముగింపు కార్యాన్ని మామూలు మాటల్లో మనం మరణం అంటున్నాం. కాని అవతారానికి, జ్ఞానికి మరణం లేదు. వాళ్లు కేవలం దేహాన్ని విడిచివేసి, భక్తులకి, సాధకులకి విదేహస్థితిలో





కూడా సాయం చేస్తూనే ఉంటారు. కాని సామాన్య మానవుడు వారు దేహాన్ని విడిచేయడాన్ని భరించలేడు. వారు ఆ ఘటనను భరించేటట్లు చేయడం కోసమే అవతారాలు అతి దీర్ఘకాలం జబ్బునపడి వారిని అందుకు మానసికంగా సిద్ధం చేస్తారేమో.

పోగా జ్ఞానావతారి జీవితమంతా శరీరదృష్టి లేకుండా, శరీరాన్ని నిర్లక్ష్యం చేస్తూ దాన్నొక జడపదార్థమని చెప్పడమే కాకుండా, ఆచరణలో కూడా చూపిస్తూ ఉండి అది రుగ్మతల పాలయినపుడు దానికి, దాని మీద జబ్బుకి లొంగిపోతాడా? అట్లా లొంగిపోతే తాను చెప్పిందేదీ సత్యం కాదని తేలుతుంది. శరీరానికి, దాని వికారాలకు, లొంగకుండా నిరంతరం ఆత్మనిష్ఠులై ఉండిన జ్ఞానిని శరీరము, శరీరానికి వచ్చిన రుగ్మత నిజానికి వారిని ఏమీ చేయలేవు. ఐతే వారే నిర్ణయించుకున్న – గీసుకున్న వారి అవతార కార్యానిది. ఆ నిర్ణీత ఘటన జరగడానికి వారెన్నడూ తమ సంకల్పం చేత అడ్డుపడరు. వారి సంకల్పానికి తిరుగులేదు. ఈనాడు ఇది జరగాలని వారు అవతరించడానికి ముందే నిర్ణయించుకున్నాక దాన్ని ఎందరు భక్తులు, శిష్యులూ కోరినా, మానుకోవడం ఉండదు. పోగా, ప్రారబ్ధాన్ని క్షీణింపచేయడం వారీ లోకానికి ఇచ్చిన సృష్టి సూత్రం. దాన్ని వారు తప్పించరు. పోగా భగవాన్ తమ జీవిత ముఖ్య ఘట్టాలన్నిటా ఈ ప్రారబ్ధ విషయాన్ని తిరుగులేని శాసనం వలే చెప్పారు. ప్రారబ్ధ విషయకంగా “మానవుని జీవితంలో ముఖ్య ఘట్టాలు, అంటే అతని వృత్తి, వ్యాపారం మాత్రమే పూర్వం నిర్ణయింపబడ్డవా? లేక సామాన్య చర్యలైన నీళ్ల గ్లాసు తీసుకోవడం, గదిలో ఒకచోట నుండి మరొక చోటికి కదలటం లాంటివి కూడా పూర్వమే నిర్ణయింపబడ్డాయా”? అన్న సందేహానికి సమాధానం చెపుతున్న సందర్భంగా శ్రీభగవాన్ “అవును, ప్రతిదీ పూర్వమే నిర్ణయింపబడింది. ఐతే శరీరం దేనికోసం జన్మించి ఉన్నది? ఈ జీవితంలో నెరవేర్చడానికి నిర్ణయించిన అనేక కర్మలను చేయడం కోసం అది నిర్మాణం చేయబడింది. ప్రణాళిక అంతా నిర్ణయం చేయబడే ఉంది. భగవంతుని ఇచ్ఛ లేకుండా ఒక్క అణువు కూడా కదలలేదు. ఇక మానవునికి స్వేచ్ఛ విషయం దేహంతో తాదాత్మ్యం పొందకుండా ఉండటానికి, దైహిక కర్మల ఫలితంగా కలిగే సుఖ దుఃఖాల చేత బాధింపపడకుండా ఉండటానికి అతడెపుడూ స్వతంత్రుడే!”

అవతారాలకి, ప్రణాళిక సిద్ధం అయ్యే ఉంటుంది. కొందరు అనుచరులు మరణిస్తున్నపుడల్లా భగవాన్ భక్తుల ప్రారబ్ధాలను తనమీద వేసికొని అనుభవించే కృపా సముద్రుడు. అంతకు మించి పరేచ్ఛా ప్రారబ్ధం ఒకటి ఉంది కదా! ఇదంతా ‘ఆ’ శరీరం అనుభవించాల్సిన చరమాంకం అనుభవించక తప్పదని చెప్పడానికి. కాని వారు సంకల్పిస్తే ఎంతటి జబ్బైనా పోయి తీరుతుంది. ఇతరులవి ఎన్ని వ్యాధులు వారట్లా పోగొట్ట లేదు. ఇట్లా అదెంతటి వ్యాధి కానీయండి. భగవాన్ వ్యాధిని కాని, వ్యాధికి వ్యాధిని కానీయండి బొత్తిగా పట్టించుకోలేదు. భగవాన్ జీవితంలో ప్రతి





క్షణము, వారి ఆచరణ ద్వారా సాధకులకు బోధనే. దేహంతో తాదాత్మ్యం లేదు, దేహదృష్టీ లేదు.

భగవాన్ యొక్క ప్రత్యేకత ఇది. భక్తులకు దర్శనం ఇవ్వడం వారి కృత్యాలలో సర్వ ప్రథమాంశంగా ఉంది. దేహం ఎంత సహాయ నిరాకరణ చేసినా, వారు భక్తులకు దర్శనమివ్వడం మానలేదు. తమ దృక్కులతో దర్శనార్థం వచ్చిన వారికి వారెంత 'శక్తిని' ప్రసాదించారో!

## మహాత్ముల మహాసమాధి వైనాలు

దట్టంగా పెరిగిన మహావృక్షం మొక్కలకు నీడనిచ్చి కాపాడుతుంది. కాని ఆ నీడలో కొత్త చెట్లు ఏపుగా పెరగవు. ఆ నీడ ప్రభావం నుండి విడివడినపుడే తక్కిన చెట్లు పెరగగలవు. శ్రీరామకృష్ణులనే కల్పతరువు, తన నీడలో పలు మొలకలను కూడా పెరగనిచ్చింది. అయినప్పటికీ అవి ఏపుగా పెరగాలంటే ఆ తరువు తన నీడను ఉపసంహరించుకోవాలి. అందుకు శ్రీరామకృష్ణులు సంకల్పించుకున్నారు. 1884వ సంవత్సరాంతం నుండే శ్రీరామకృష్ణుల ఆరోగ్యం క్షీణించసాగింది. ఆయన పేరు కలకత్తా యావత్తూ వ్యాపించడంతో జనం తండోపతండాలుగా ఆయన వద్దకు రాసాగారు. వచ్చిన వారందరితోను ఆయన మాట్లాడారు, పాడారు, నృత్యం చేసారు. పారవశ్య స్థితులలోకి వెళ్లారు. ఇవి ఆయన ఆరోగ్యానికి హానికరమని వైద్యులు హెచ్చరించినా ఆయన ఖాతరు చేయలేదు. ప్రాపంచికమైన దుఃఖాలలో కొట్టుమిట్టాడుతూ తమ వద్దకు వచ్చిన లోకులకు కించిత్తు అయినా తమ వలన స్వాంతన లభించే పక్షంలో అందుకోసం ఏది చేయడానికైనా ఆయన సిద్ధపడ్డారు.

శ్రీరామకృష్ణులకు ఉత్కృష్ట వైద్య చికిత్స చేయించాలని భక్తులు నిర్ణయించారు. అందుకు తగిన సౌకర్యాలు దక్షిణేశ్వరంలో లేవు. కనుక కలకత్తాలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. ఆ ఇల్లు మరీ చిన్నది. దక్షిణేశ్వరంలో ఆరుబయట జీవించడానికి అలవాటు పడిన శ్రీరామకృష్ణులు ఆ చిన్న ఇంట్లో ఇమడలేక బాగా ఇబ్బందికి గురి కావడంతో శ్యాంపుకూర్ అనే ప్రాంతంలో ఒక ఇంటిని అద్దెకు పుచ్చుకున్నారు. శ్రీరామకృష్ణులకు ఉన్నతమైన చికిత్స చేయించడానికి భక్తులు చక్కని సౌకర్యాలు కల్పించారు. మాతృమూర్తి శ్రీశారదాదేవి పథ్యపానాదుల బాధ్యత వహించారు. యువశిష్యులు శ్రీరామకృష్ణులతోపాటు ఉండి, సేవాశుశ్రూషలు చేస్తూ, ఆయనను కంటికి రెప్పలా కాపాడసాగారు. శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్‌కు వచ్చి మూడు నెలలు గడిచిపోయాయి. వైద్యుల చికిత్స, మాతృదేవి పరిపోషణ, యువశిష్యుల సేవాశుశ్రూషల ఫలితానికి విరుద్ధంగా ఆయన వ్యాధి రోజురోజుకీ తీవ్రం కాసాగింది. మునుపు కాస్త సత్ఫలితాలను ఇచ్చిన మందులు కూడా ఇప్పుడు నిష్ప్రయోజనమయ్యాయి. కలకత్తా





కలుషిత వాతావరణ కారణంగానే వ్యాధి ప్రకోపిస్తున్నదని నిర్ధారణ చేసిన వైద్యులు, నగర ప్రాంతాన్ని వదలి, బాగా విశాలంగా ఉండే నగర శివార్లకు ఆయనను తరలిస్తే బాగుంటుందని సూచించారు. వారి సూచన మేరకు భక్తులు కాశీపూర్ అనే ప్రాంతంలో ఒక ఉద్యాన గృహాన్ని అద్దెకు తీసుకున్నారు. 1885 డిసెంబరు 11వ తేదీన శ్రీరామకృష్ణుల బసను అక్కడకు మార్చారు.

శ్రీరామకృష్ణులు ఒక అవతార పురుషుడు. ఆయన సంకల్పమాత్రానే ఈ వ్యాధిని సంక్రమింప చేసుకున్నారు. ఏదో ఒక రోజు హఠాత్తుగా తమ దివ్య శక్తిని ప్రదర్శించి, వ్యాధిని నయం చేసుకుంటారని కొందరు విశ్వసించారు. కాని ఈ వ్యాధిని నిమిత్తమాత్రంగా కనపరిచారు శ్రీరామకృష్ణులు. "నా వ్యాధి నిమిత్తమాత్రమే. ఈ వ్యాధి మీ అందరినీ ఐక్యం చేసింది" అన్నారాయన. ఆ వ్యాధి కారణంగానే భక్తులందరూ ఐక్యం కాగలిగారు. వారి మధ్య ఒక అనురాగబంధం పెంపొందింది. అది భవిష్యత్ సంఘానికి ఆధారభూతమయింది. అన్నింటినీ మించి అద్భుతమైన ఒక భావనను చెబుతూ వారు నిజాన్ని గ్రహించేలా చేసాడు నరేంద్రుడు. 'క్రీస్తు అనుకరణ' అనే పుస్తకం నుండి ఇలా ఉదాహరించాడు. ***"నిజమైన దేవుని కుమారుడు క్రీస్తును ప్రేమించే వారి జీవితం పూర్తిగా ఆయన జీవితం మాదిరే అయిపోతుంది. ఇదే మనకు గీటురాయి. మన జీవితం శ్రీరామకృష్ణుల జీవితంలా పరిణమిస్తే మనం ఆయనను ప్రేమిస్తున్నామని అర్థం. మరేదీ నిజం కాబోదు".*** ఏదో కొన్ని సమయాల్లో పాడుతూ, నృత్యం చేస్తూ కన్నీరు స్రవించే రీతిలో ఉంటూ, తక్కిన సమయాల్లో ఇష్ట ప్రకారం జీవించడం శ్రీరామకృష్ణులు చూపిన జీవితం కాదు అనే సత్యాన్ని ఇందుమూలంగా నరేంద్రుడు తేటతెల్లం చేశాడు.

ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలు గడిచిపోయాయి. శ్రీరామకృష్ణుల ఆరోగ్యం బాగా క్షీణించింది. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం లాంటి అనేక వైద్య పద్ధతులతో ఆయనకు చికిత్స చేసారు. అయినప్పటికిని ఆరోగ్యం మెరుగు పడకపోగా, నానాటికీ మరింత క్షీణించసాగింది. ఈ రుగ్మత నుండి తాను బయటపడనని రూఢిగా తెలిసినా, అది తెలిస్తే తక్కినవారు బాగా కలత చెందుతారనే కారణంగా ఎవరితోను ఈ విషయం గురించి ప్రస్తావించలేదు. ***ప్రారంభం అంటూ ఒకటి ఉన్నప్పుడు ముగింపు అనేది కూడా ఉండే తీరాలి కదా!*** తమ వ్యాధి నయం కాదని శ్రీరామకృష్ణులు నిర్ధారణ చేసుకొని, దానిని అట్లే స్వీకరించాలని సంకల్పించుకున్నారని ఈ క్రింది సంఘటనలు తెలుపుతున్నాయి. ఒకరోజు శశిధర పండితుడు కాశీపూర్ వచ్చాడు. ఆయన గురుదేవులతో, "మహాత్ముల అలౌకిక శక్తులను గురించి శాస్త్రాలు పేర్కొంటున్నాయి. వారికి వ్యాధి సంక్రమిస్తే తమ మనఃశక్తిని వ్యాధిగ్రస్థమైన శరీర భాగం మీద ప్రసరింపచేయడం ద్వారా ఆ వ్యాధిని నయం చేసుకోగలిగేవారు. మీరు కూడా ఎందుకు అలా చేయకూడదు?" అని అడిగాడు. ఇది గురుదేవులకు సుతరామూ నచ్చలేదు.





కాస్త చీవాట్లు పెట్టే ధోరణిలో, ***"ఉద్దండ పండితుడివై ఉండి, నీలో ఇలాంటి ఆలోచనలా? ఈ మనస్సు పరిపూర్ణంగా భగవంతునికి అర్పితమయింది. దానిని ఆయన నుండి నిరుపయోగమైన శరీరం మీదికి మరల్చడమా?"*** అని అడిగారు. పండితుడు మౌనం వహించాడు. కాని శిష్యులు పట్టుబట్టారు. "ఎలాగైనా సరే మీరు ఈ రుగ్మతను నయం చేసుకునే తీరాలి. మా కోసమైనా దీనిని చేయండి" అంటూ అందరూ ప్రాథేయపడ్డారు. ***"అంతా జగజ్జనని సంకల్పం మేరకే జరుగుతుంది"*** అన్నారు శ్రీరామకృష్ణులు. "అలా అయితే ఆమెనే ప్రార్థించండి. మా కోసం మీరు దీనిని జగజ్జననిని కోరే తీరాలి" అన్నాడు నరేంద్రుడు. సంకోచిస్తూ అందుకు ఆయన సమ్మతించారు. కొన్ని గంటలు గడిచాయి. నరేంద్రుడు గురుదేవులతో, "జగజ్జననిని ప్రార్థించారా?" అని అడిగాడు. అందుకు శ్రీరామకృష్ణులు ప్రశాంతంగా ఇలా జవాబిచ్చారు. "అవును. అడిగాను. "అమ్మా! గొంతు నొప్పి కారణంగా నేను ఏమీ తినలేకపోతున్నాను. నేను ఏదో కాస్త తినేలా అనుగ్రహించుతల్లీ" అని ఆమెను ప్రార్థించాను. అందుకు ఆమె ఏం చెప్పిందో తెలుసా? "ఎందుకు? ఈ ఒక్క నోటితోనే నువ్వు తినాలా? ఎన్నో నోళ్ల ద్వారా తింటున్నావుగా! అది చాలదా?" అని అడిగింది. నేను సిగ్గుపడ్డాను. ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయాను. మరొకరోజు రాఖాల్, శ్రీరామకృష్ణులతో ఈ వ్యాధిని నయం చేయడం గురించి మాట్లాడాడు.

రాఖాల్ : మీ దేహం ఇంకా కొంతకాలం నిలిచి ఉండాలని జగజ్జననిని ప్రార్థించండి.

శ్రీరామకృష్ణులు : అంతా జగజ్జనని సంకల్పం ప్రకారం జరుగుతుంది.

నరేంద్రుడు : మీ సంకల్పమూ, జగజ్జనని సంకల్పమూ వేర్వేరా? రెండూ ఒకటయ్యాయి కదా?

శ్రీరామకృష్ణులు కాసేపు మౌనంగా ఉండిపోయారు. ఆ తరువాత ఇలా అన్నారు. "నేను జగజ్జననితో మాట్లాడినా ప్రయోజనం ఉండదు. నేనూ ఆమె ఒకటే అయిపోయినట్లుగా ఇప్పుడు చూస్తున్నాను". అర్ధరాత్రి గడిచాక శ్రీరామకృష్ణులకు బాహ్యస్మృతి కలిగింది. ఆకలిగా ఉందన్నారు. భక్తులు పట్టుకోగా లేచి కూర్చున్నారు. అందరూ ఆశ్చర్యపోయేలా ఒక గ్లాసు జావ సునాయాసంగా త్రాగారు. ఇంత ఆహారం ఆయన పుచ్చుకుని చాలా రోజులయ్యింది. జావ త్రాగాక ఒంట్లో కాస్త సత్తువ వచ్చినట్లుగా ఉందన్నారు. ఆయన నిద్రపోతే మంచిదని నరేంద్రుడు సూచించాడు. నొప్పి కారణంగా ప్రక్కనే ఉన్నవారికి సైతం వినపడనంత అతి మెల్లగా మాట్లాడే శ్రీరామకృష్ణులు బిగ్గరగా, "అమ్మా! కాళీ!" అంటూ మూడుసార్లు పిలిచి మెల్లగా పడుకున్నారు. పిదప నరేంద్రుడు క్రిందికి వెళ్లాడు.

రాత్రి ఒంటిగంట రెండు నిమిషాలు. మంచం మీద పడుకుని ఉన్న శ్రీరామకృష్ణుల శరీరంలో హఠాత్తుగా పారవశ్యస్థితి జనించింది. రోమాంచితమయింది. దృష్టి నాసికాగ్రంలో





ఏకాగ్రమయింది. పెదవులపై దరహాస చంద్రికలు వెల్లివిరిసాయి. ఆయన సమాధిమగ్నులయ్యారు. ***ఇంతకాలంగా ఆయన అనుభవిస్తూ వచ్చిన సమాధి కాదది, మహాసమాధి. కాళీమాత ఒడిలో ఆమె అనుంగు పుత్రుడు శాశ్వతంగా నిద్రించిన ప్రగాఢ సమాధి. ఈ సమాధి తదుపరి ఆయన ప్రాణం శరీరంలోకి తిరిగి రాలేదు.*** అది 1886 ఆగష్ట్ 16వ తేది.

కాశీపూర్ శ్మశానం నుండి శ్రీరామకృష్ణుల అస్థికలను ఒక కలశంలో సేకరించి దానిని మోసుకొని కాశీపూర్ ఉద్యాన గృహం చేరుకున్నారు భక్తులు. "భగవాన్ శ్రీరామకృష్ణదేవ్‌కి జై" అనే నినాదంతో దానిని శ్రీరామకృష్ణుల మంచం మీద ఉంచినపుడు, ***శ్రీరామకృష్ణుల సాన్నిధ్యాన్ని అనుభూతం చేసుకొన్నా, వారి మనస్సులను శూన్యం ఆవరించింది. కాని వారు, ఆయన జీవిత కాలంలో ఎలాంటి వినాశం లేని ప్రేమతో పెనవేసుకొని ఉన్నారో, అదే ప్రగాఢ ప్రేమ ఇప్పుడు సైతం వారిని పెనవేసి ఉంచింది. ఒకే లక్ష్యంతో జీవించిన వారు పరస్పరం స్వాంతనపరచుకుంటూ, మెల్లగా తేరుకుంటూ గట్టి నమ్మకంతో ముందుకు సాగారు.***

## పత్రికలో పదముద్రలు

ఎప్పటిలాగే తెల్లవారింది. బ్రతుకు బండి పరుగులిడడం మొదలయ్యింది. గురుదేవులు అందించిన ప్రేమ, కరుణలే అందరి జీవితాలకు వెలుగునిచ్చాయి. చిన్నారులు స్కూళ్లకు, పెద్దలు వ్యాపకాలకు (వృత్తులకు) సాగిపోయారు. అందరూ ఆ రోజును ప్రతిరోజూలాగానే భావించారు. ఊహించలేదు. ఆరోజు చరిత్రలో ఒక అత్యంత ఆవేదనాభరితమైన, దుఃఖానికి ఆద్యమైన రోజని! ఆ వేదన అందరు సాయిభక్తుల హృదయాలను గాయపరిచింది. ఎందరో భక్తుల కన్నీళ్లు కూడా ఇంకిపోయాయి. మనసు ఆ బాధను తట్టుకోలేక స్తబ్ధుగా మారింది. ఎందుకింత బాధ, చిన్న మా మనస్సులపై ఇంత పెద్ద గాయమా సాయి! మాది ఏ పాటి స్థాయి! ఇది భరించి తట్టుకోగలమనే విశ్వాసం మీకు మాపై ఉందా! అంటూ సాయి పాదాలను పట్టుకు మూగగా రోదించాయి ఎన్నో హృదయాలు. చిన్న మా ఊహకు, మా చిన్న ఈ అనుగ్రహ ప్రపంచానికి ఆయన రాజు కదా సాయి! ఇంతకాలం నీవే తానుగా భావించి, అనుభవించి, బ్రతుకును వెళ్లదీస్తున్నాము. ఆ అనుగ్రహరాజు లేని లోటు మాకు ఎలా తీరేది సాయి? అందరూ (శ్రీబాబూజీతో సహా) చెపుతున్నారు భౌతికంగా మాత్రమే వారు లేరని! దివ్యస్వరూపులై, సమాధానమిచ్చే సమాధిరూపులై సదా మాతో వసిస్తున్నారని! ఈ చిన్న మనసుకు ఎలా అర్థమవుతుంది – అంత గొప్ప తత్త్వం! జీవన సత్యం!



జీవిత గమనంలో ఎదురయ్యే ప్రతీ సంఘటనను తన ప్రబోధంగా మార్చిన మా రాజు మాకు తమ (స్వ)రూపంలో కన్పించరంటే తట్టుకోగలిగిన మనఃస్థిరత్వం మాకుందా



సాయి? బిడ్డలకు పేరు నుంచి, మా తల్లిదండ్రుల ఆరోగ్యాల వరకు ఆ మహారాజుతోనే విన్నవించే వాళ్లం. ఆ కరుణామూర్తి అభయం పొంది తపస్సు చేయకనే వరము లొందిన భక్తుల వలే బ్రతుకును పండించుకున్నాం! ఇక పండదా! ఆ అభయం మాకుండదా! అన్న సందేహం కాదు మాకున్నది. ఆ రూపం కన్పించడం లేదనే వెలితి మాకు ఎలా నిండేది? సాయి భక్తుల అనుభవాల నేపథ్యాలను అవధరించి(చదివి), ఆ అనుగ్రహ రాజు వారి జీవితాలను దేదీప్యమానంగా మలచిన తీరును దర్శించి, స్మరించి, పులకించిన 'గురుకృప'కు ఇది ఎంతటి హతత్పరిణామో, పూరించలేని లోటో తెలియకుంది.

ఆ అనుగ్రహ రాజు–శరశ్చంద్ర మహారాజు భౌతికంగా లేని లోటు ఎలాగూ తీరేది కాదు. ప్రారంభమంటూ ఉన్నపుడు ముగింపు కూడా ఉండే తీరాలి కదా! ఒక గొప్ప అనుగ్రహశకం ముగిసింది. శరశ్చంద్రుడు మేఘాల మాటుకు, కొంత సమయం పయనమయ్యాడు. ఒక గొప్ప సద్గురుతత్త్వం, మూర్తీభవించిన మానవత్వం, పరిమితులు లేని అనుగ్రహతత్త్వం, సంచరించిన దైవత్వం, మానవ చక్షువులకు కన్పడక దూరమయ్యింది. ఒక ధ్రువతారగా దివ్యునిగా అనుగ్రహ వినీలాకాశంలో దర్శనమిచ్చింది. శరశ్చంద్ర మహారాజు భౌతికంగా లేరంటే ఎందుకింత బాధ, ఏమిటింత వేదన? ఎందుకంటే మానవజాతి ఈనాడు ఒక ఆదర్శాన్ని, ఆశయాన్ని, అకుంఠిత దీక్షను, సత్యాన్ని, జ్ఞానాన్ని, ఉద్యమాన్ని, ప్రేమను, కరుణను, దైవానుభూతిని, శక్తిని, ఇవన్నీ ఒకేరూపంలో కలబోసిన రూపును భౌతికంగా దర్శించుకోలేకపోతోంది – అదే ఈ ఆవేదనకు ఆది!

అనుగ్రహరాజు – శరశ్చంద్ర మహరాజు ప్రతి అడుగు ప్రణాళికాబద్ధమే! ప్రతీ అడుగూ వారు నమ్మిన ఆదర్శాలవైపే! ఆశయాలవైపే! సాయి అనే ఆకాంక్ష వైపే! సాయి తప్ప అన్యము లేదు! సాయి తప్ప గమ్యము లేదు! ఆ అనుగ్రహరాజు చెంతకు సుమారు మూడు దశకాల పూర్వం పదుల సంఖ్యలో గురుబంధువులు చేరారు. నేడు వేల సంఖ్యలో గురుబంధువులు వారి అనుగ్రహ వర్షంలో తడిసి ముద్దవుతున్నారు. కాలం సాగింది! ఎన్నో మార్పులు వచ్చాయి! కాని వారి ఆదర్శంలో, ఆశయంలో, ఆకాంక్షల్లో మాత్రం ఒక్క అంశమే నిలిచింది. నాటి నుండి నేటి వరకు అది సాయి, సాయి, సాయి... సాయి తప్ప జగము లేదు! సాయి తప్ప హితము లేదు. సాయే మన బ్రతుకుకు వారధి! సాయి నిజతత్వమే ఇహపరముల వారధి. "మనందరికీ శ్రీసాయిబాబానే నాయకుడు – మనమందరం ఆయన అడుగుజాడల్లో నడించేందుకు ప్రయత్నించే అనుయాయులమే!" అంటూ వారి ఆశయాన్ని ఈ మధ్య కాలంలో మరొక్కసారి తేటతెల్లం చేసారు. వారి ఆదర్శాన్ని, ఆకాంక్షను మనందరికీ మరొక్కసారి తెలిపే ఈ 'గురుకృప' పత్రికానుభవాన్ని అవధరించండి.





ఇప్పటి వరకు పన్నెండు సంవత్సరాల తొమ్మిది నెలల నుండి (51 సంచికలు) అప్రతిహతంగా, కాలపరిమితితో, గురుకృప పత్రిక కేవలం సద్గురు అనుగ్రహమే అండగా గురుబంధువులకు చేరుతోంది. పత్రిక గురించి గురుబంధువులు కొందరు అడిగేవారు, ముఖచిత్రంగా ఎప్పుడూ శ్రీబాబూజీనే ప్రచురిస్తున్నారు, శ్రీసాయిబాబా రూపాన్ని ప్రచురించవచ్చు కదా అని! శ్రీ సాయిభక్తుల మమతానురాగాల మాలలతో శ్రీబాబూజీని పూజించుకోవాలన్న ఒక చిన్న ఆశ తప్ప మరే ఆలోచనా మదిలో లేదని విన్నవించడం జరిగింది. అలా ఇప్పటి వరకు వచ్చిన అన్ని సంచికలపై శ్రీబాబూజీనీ ముఖచిత్రంగా దర్శనమిచ్చారు. 'గురుకృప' విజయదశమి సంచిక (2010) రూపుదిద్దుకుంటున్న రోజులవి.

విశాఖ నుంచి సత్యంగారు ఫోన్ చేసారు. కవర్‌పేజీ ముస్తాబయ్యిందని, మెయిల్ పెట్టారని, ఉత్సుకతగా మెయిల్ చూసాను – ఇన్ని వత్సరాలలో మొదటిసారి శ్రీసాయిదర్శనమిచ్చారు ముఖచిత్రంగా! క్రింద పూజ్య గురుదేవుల ఆశయం, ఆకాంక్ష – అక్షరరూపంలో! అర్థం కాలేదు, ఏదో క్రొత్తగా అనిపించింది. ఫోన్ చేస్తే ఇలా అన్నారు. "ఏమోనమ్మా! గురుదేవుల చెంతన, కూర్చున్న క్షణాల్లో అలా చేయాలనిపించింది" అన్నారు. "ఇంకోసారి ఆలోచిద్దామా!" అన్నాను నా చిన్న బుర్రతో! "లేదమ్మా, ఈసారి ఇదే!" అన్నారు. పత్రిక సిద్ధమయ్యింది. శ్రీసాయి సమాధి మందిరం బ్యాక్‌గ్రౌండ్‌లో, శ్రీసాయిరూపం పతాక శీర్షికలో, సాయిచెంతన శ్రీబాబూజీ రూపం చాలా చిన్నదిగా! గురుదేవులు ప్రణాళికాబద్ధంగా రచించిన ఈ అనుగ్రహకృతిని 'శృతి'కి పంపితే తను ఇలా అంది "ఇలా శ్రీసాయిని ఎప్పుడు చూస్తానా అని వేచి చూస్తున్నాను". విజయదశమికి సంచిక వెలువడింది, సంబరపడ్డాము, సంతోషించాము. కానీ ఆ అనుగ్రహ ప్రణాళిక చాటున దాగిన చేదునిజాన్ని అవగతం చేసుకోలేపోయామనిపించింది. గురుదేవుల ఆశయానికి, ఆదర్శానికి రూపమా అన్నట్లు 13 సం॥లలో మొట్టమొదటి సారిగా శ్రీసాయి ముఖచిత్రంగా దర్శనమిచ్చారు. వారి ఆశ(యం) నెరవేరింది. చివరి సంచిక శ్రీసాయిసమాధి మందిరమయితే ఈ సంచిక గురుదేవుల సమాధాన రూపం. ఇది కాకతాళీయమందామా! కరుణా స్వరూపుని ప్రణాళికా రూపమందామా!

అనుగ్రహరాజు శరశ్చంద్రమహరాజు తమ ఆశయాన్ని , ఆదర్శాన్ని ఆకాంక్షను ప్రస్ఫుటంగా మనకందరికి తమ చివరిబోధగా (Departing message) అందించి, వెళ్లారనిపించింది. బిడ్డ కేవలం కొన్ని వందల కిలోమీటర్ల దూరం వెళుతుందని తెలిసినా, ఎప్పుడైనా బిడ్డ చెంతకు వెళ్లగలనన్న అవగాహన ఉన్నా, తల్లి మాత్రం ప్రతి చిన్న జాగ్రత్తను బిడ్డకు చెప్పనిదే వదలదు. జన్మనిచ్చిన తల్లికే అంత ప్రేమ ఉంటే ఇక సద్గురువు గురించి చెప్పాలా! జన్మ జన్మలకు మనతో(డు) ఉండి మన ఉద్ధరణే తమ మహోన్నతకార్యంగా భావించే ఆ మహితమూర్తి మనకు ఈ మధురస్మృతి





మిగిల్చారు. ఈ స్మృతి రేపటి మన అడుగులకు ఒక బాట, ఏది గమ్యమో, చెప్పే ఒక బోధ.

ఆ అనుగ్రహరాజు చెంతన ప్రతి అంశమూ ప్రణాళికాబద్ధమే! అంతా ముందుగానే రచించిన ఒక కథలా తోస్తుంది. అది వారు దేహత్యాగం చేసిన రోజు ఆచార్య భరద్వాజగారి జన్మదినమైనా! (తిథుల ప్రకారం) వారి మొదటి ఆరాధనా మహోత్సవాల సమయంలో వారికి అత్యంత ప్రీతి పాత్రులైన చంద్రశేఖర సరస్వతుల 17వ ఆరాధనోత్సవ సమయమైనా!

గురుబంధువుల్లారా! గురుదేవులు సమాధాన రూపం ధరించారు. ఇక మనకు మిగిలినది ఆ మహరాజుతో గడిపిన మధుర స్మృతులు మననమే! ఆ మననమే మనకు కొండంత అండ! మనందరం ఇక ఆ మననంలో గడిపే ప్రయత్నం చేద్దాం. మీ ప్రేమను అక్షర రూపంలో వ్యక్తం చేయమని సవినయంగా వేడుకుంటోంది గురుకృప పత్రిక! మనందరికి శ్రీబాబూజీ భౌతికంగా లేని లోటును భరించే శక్తిని, సదా గురుస్మరణలో గడిపే భక్తిని శ్రీసాయినాథుడు అనుగ్రహించుగాక!

## అనుగ్రహించడమే నా పని!

పూజ్య గురుదేవులు సద్గురు శ్రీసాయినాథుని పాదపద్మములకు నమస్కరిస్తూ.. గురుదేవులు మహాసమాధి అనంతరం నాకు ప్రసాదించిన అనుభవాన్ని, రక్షణను, ప్రేమను అందరితో పంచుకుంటూ నేను గత కొన్ని సంవత్సరాల నుండి గురువుగారి వద్దకు తరచూ దర్శనం నిమిత్తం వెళుతుండేవాడిని. నేను గురువుగారి దగ్గరకు దర్శనానికి వెళ్లి గురువుగారి పాదాలకు నమస్కరించుకొని, ఆయన చేతుల మీదుగా ఊదీ తీసుకున్న ప్రతిసారి గురువుగారు నాకు ఏదో ఒకటి పండుగాని, స్వీటు గాని, బిస్కెట్స్‌గాని, చాక్లెట్స్‌గాని ఇలా ఏదో ఒకటి ఇచ్చేవారు. గురువుగారు శిరిడీలో ఉండే రోజుల్లో గురువుగారి సన్నిధిలో రెండు సం॥లు గడిపే అవకాశం కలిగింది. ఆ రెండు సం॥ల కాలంలో వచ్చిన నా రెండు బర్త్‌డేలకు గురువుగారు నాకు ఒక బర్త్‌డేకి రిస్ట్ వాచ్, మరొక బర్త్‌డేకి క్లాక్‌పీస్ గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇలా నేను గురువుగారి దగ్గరకు దర్శనానికి ఎప్పుడు వెళ్లినా గురూజీ నన్ను రిక్త హస్తాలతో పంపించలేదు. మొదటిసారి నేను, గాయత్రి గురువుగారి దగ్గరకు అరుణాచలం వెళ్లి మా వివాహానికి అనుమతిని అడిగి, తమ చేతుల మీదుగా మా వివాహం చేయండి అని గురువుగారిని అడిగినపుడు కూడా గురువుగారు నవ్వుతూ, ఆశీస్సులతో మాకు బిస్కెట్స్ ఇచ్చారు. మా వివాహానంతరం దర్శనానికి అరుణాచలంలో గురువుగారి దగ్గరకు వెళ్లగా, గురువుగారు ఆప్యాయంగా పలకరిస్తూ, "బాబా ఉన్నారు. అన్నీ బాబా చూసుకుంటారు" అని మాకు ధైర్యం చెబుతూ, ఊదీ, చాక్లెట్స్ ఇచ్చారు.



గురుదేవుల మహాసమాధి అనంతరం దర్శనం చేసుకుందామని వెళ్లాను. గురువుగారిని చూడగానే ఇక నేను జీవితంలో పొందలేనిదేదో కోల్పోయాననే బాధ, గురుదేవుల దర్శనం నిమిత్తం ఆయన సన్నిధిలో గడిపిన క్షణాలు , గురుదేవులు ఇచ్చిన ప్రసాదం, ఊదీ, ఆయన చెప్పిన మాటలు, ఇచ్చిన అనుభవాలు, నా మీద చూపిన ప్రేమ. ఇలా పొందిన మధురానుభూతులు మనసులో మెదిలాయి. ఈ ఆలోచనలు రాగానే నా మనసులో మరొక బాధ. ఎప్పుడు గురువుగారి దగ్గరకు వచ్చినా ఏదో ఒకటి ఇచ్చి పంపుతారు. ఒట్టి చేతులతో పంపరు. కాని ఇప్పుడు గురువుగారు మనకు భౌతికంగా లేరు. ఇక నేను గురువుగారి చేతులమీదుగా ఏమీ తీసుకోలేను అనే బాధ ఒక ప్రక్క, ఈ నిమిషంలో కూడా నేను గురుదేవుల నుండి ఏదో ఆశిస్తున్నానని నామీద నాకే అసహ్యం మరొక ప్రక్క. ఇలా రకరకాల ఆలోచనలు కలుగుతున్నాయి. గురువుగారి పాదాలకు నమస్కరించుకొని, గురుదేవా! మీ దగ్గరనుండి ఒట్టి చేతులతో వెళ్లవలసి వస్తుంది. మీరు ఇక మాకు లేరా? మాతో లేరా? అని గురువుగారిని అడుగుతూ గురువుగారిని దాటి నాలుగు అడుగులు వేసాను. ఇంతలో కుమార్ అనే ఒక గురుబంధువు వెనక్కి పిలిచి నా చేతిలో ఆరు బిస్కెట్స్ ఉంచారు. నాకు నోటమాట రాలేదు. అది సమయం, సందర్భం కాదు, నేను ఎవ్వరినీ ఏమీ అడుగలేదు. ఒక్క గురువుగారిని మాత్రమే మనసులో అడిగాను. నాకు ఎప్పటిలాగానే గురువుగారు ప్రసాదం ఇచ్చారు. గురుదేవులు మనతో భౌతికంగా మాత్రమే లేరు. గురుదేవుల నుండి నేను పొందే ప్రేమ, రక్షణలో మహాసమాధి ముందు, మహాసమాధి అనంతరం ఎటువంటి వ్యత్యాసం లేదు అని అనుభవమయింది. గురుదేవులు ఎప్పుడూ మనతోనే ఉన్నారు, మనతోనే ఉంటారు అన్న నమ్మకం ఈ అనుభవంతో ధృడమైనది. ఇలా గురుదేవులు నన్ను తీర్చిదిద్దే విధానం కొనసాగుతూనే ఉంది.

– *అనిల్‌కుమార్, విజయవాడ.*

## సంకేతసారం... సమాధాన రూపం..

గురుబంధువులందరికీ నమస్కారం. నాపేరు జనార్ధన్. నేను ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో వుంటున్నాను. నాకు బాబా, గురువుగార్లతో 1995 నుండి పరిచయం. అప్పటి నుండి బాబా, గురువుగారు నాకు ఎన్నో అనుభవాలు ఇచ్చారు. ప్రతి క్షణం ఇస్తూనే ఉన్నారు. జీవితంలోఎన్నో నేర్పిస్తూ ఉన్నారు. గురువుగారు మహా సమాధి అవుతారన్న విషయాన్ని ఒక సంకేత రూపంలో నాకు సూచించినా వారు సమాధి అయిన అనంతరం శిరిడీకి వచ్చినపుడు నవంబరు 16, 2010 తేదీన మాత్రమే ఆవిషయాన్ని గుర్తించగలిగాను. అదెలాగో చెబుతాను. నాకు రెండు మూడు నెలల క్రితం ఒక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు దర్శనమిచ్చి వెళ్లిపోయారు అని అందరూ





చెప్పుకుంటూ వెళుతున్నారు. ఇక దర్శనాలు లేవని కూడా అంటున్నారు. అయ్యో నేను దురదృష్ట వంతుడిని సమయానికి రాలేకపోయాను అనుకుంటూ వున్నాను. ఆ తరువాత నేను ఒక్కడినే ఒక దగ్గర పోతున్నాను. అపుడు మధ్యలో ఒక ప్రదేశంలో రోడ్డు ప్రక్కన గురువుగారు ఒక గుంటలో కూర్చుని వున్నారు. దూరం నుండి నాకు కనబడుతూ ఉన్నారు. వెంటనే ఆనందంతో దగ్గరికి వెళ్లాను. అపుడు గురువుగారు ఏం కావాలి అన్నారు? మీ పాద దర్శనం కావాలి అన్నాను. అపుడు నాకు పాదాలు అందడంలేదు. అపుడు నేను వంగి కొంచెం లోపలికి దిగి పాద దర్శనం చేసుకోవడం జరిగింది. తరువాత నాకు మెలకువ వచ్చి ఎంతో ఆనందంగా అనుభూతి పొందాను. కాని అప్పటినుండి ప్రతి రోజూ దీని గురించి ఆలోచించేవాడిని. గురువుగారు ఎందుకు అలా గుంటలో కూర్చున్నారు అనేది నా మనసులో ఒక ప్రశ్నలాగా నవంబరు 16 వరకు అలాగే ఉండిపోయింది. కాని ఆరోజు సమాధికి త్రవ్విన గుంట చూసి ఒక్కసారిగా కన్నీళ్లతోపాటు నాకు వచ్చిన స్వప్నానికి అర్థం తెలుసుకుని బాధతో కూడిన అనుభూతికి లోనయ్యాను. ఒక స్పష్టమైన సంకేతముతో గురువుగారు తమ ఇచ్ఛానుసారం వారి దేహాన్ని వదిలి మహా సమాధి అయ్యారని తెలిపారు. ప్రతి క్షణం కంటికి రెప్పలా కాపాడుతున్న గురువుగారికి, బాబాకి శతకోటి కృతజ్ఞతలు.

*– జనార్ధన్, హైదరాబాద్*

## తగ్గేందుకు మందులేదు... తగ్గక దారిలేదు

పూజ్య శ్రీసాయినాధుని శరత్‌బాబూజీ చరణాలకు నా నమస్సులు. నేను గురుదేవుల వద్దకు 1982లో చేరాను. అప్పటి నుండి నా జీవిత పంథా అనుకోని విధంగా మారుతూ అవసరాలు తీర్చే పరంపరలో సాగుతుంది. ఇటు ఆరోగ్యరీత్యా, అటు సంసారికంగాను నాకు వచ్చిన కష్టాలను శ్రీగురుదేవులు ఎలా కడతేర్చారో చెప్పాలంటే అదొక పుస్తకం అవుతుంది. నా జీవితంలో జరిగిన ఒక ప్రధానమైన సంఘటనను నేను ఇక్కడ ఉదహరిస్తున్నాను.

అది 1993వ సంవత్సరం. నేను మహబూబ్‌నగర్‌లో ఉద్యోగం చేయుచున్నాను. నాకు షుగర్ వ్యాధి 1989 నుండి వుంది. గురుదేవులు అనేక పర్యాయములు నన్ను ఆసనాలు వేయమని, అశ్రద్ధ చేయవద్దని, భోజనమైనా మానివేయి గాని, ఆసనాలు మానవద్దని ఎన్నోమార్లు చెప్పిన, నాకున్న అశ్రద్ధ వల్ల పూర్తిగా పాటించలేకపోయాను. రకరకాల ఇబ్బందులు వస్తూ వున్నాయి. గురుదేవుల దయవల్ల తగ్గుతున్నాయి. 1993లో నాకు ఎడమకాలి మోకాలుకి లోపల భాగంలో ఒక చిన్న పొక్కులాగ మొదట వచ్చి, దినదినానికి పెద్దది అవుతూ, అర్ధరూపాయంతగా అయ్యి, లోపల కండభాగం తగ్గుతూ ఉంది. ఇక లాభం లేదనుకుని నేను హైద్రాబాద్‌లోని నా స్నేహితుడు





నారాయణరావుగారికి చూపించగా వారి సలహా మేరకు డాక్టర్లుకు చూపించాను. వారు పరీక్ష చేసి, ఇది చాలా ప్రమాదకరమైనది, దీన్ని తెలుగులో రాచపుండు, ఇంగ్లీషులో కార్బంకుల్ అంటారు. ఇది తగ్గేందుకు మందులేదు, ఇన్సులిన్ మూడు పూటలా ఇస్తూ, డ్రెస్సింగ్ చేస్తూ ఉంటే మానవచ్చు లేక మానకపోవచ్చు. మానుటకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయి అన్నారు. ఈ పరిస్థితులలో జరిగేది పైకి వెళ్లడమేనని నాకు అర్థం అయ్యేటట్లుగా చెప్పారు. ఇక నా పరిస్థితి ఎంత ఇబ్బందిగా ఉందంటే తేళ్లు మీద పడి కుడితే ఎంత బాధగా ఉంటుందో అంత బాధ ప్రతి గంట, అర్ధగంటకి కలుగుతుంది ఇట్టి పరిస్థితుల్లో నా గురుదేవులు నాకు దిక్కని, వారికి తెలపాలని విశ్వప్రయత్నం చేసాను. కాని అప్పటికే నెల రోజుల ముందు గురుదేవులు శిరిడీ విడిచి, హిమాలయాలకు వెళ్లారని, ఎక్కడ ఉన్నది తెలియదని తెలిసింది. ఇక నా పరిస్థితి అయోమయంగా ఉంది. ఇక నేను చావడం తప్ప ఇంకో మార్గం లేదని, కళ్ల వెంట అశ్రుధారలతో కాలం గడిపాను. ఇలా మూడు రోజులు గడిచింది. రాత్రిపూట ఈ బాధ వల్ల నిద్ర కూడా ఉండేది కాదు. కూర్చునే నిద్రపోతుండేవాడిని. నాలుగవ రోజున నారాయణరావుగారింట్లో వున్న ఫోను రాత్రి పన్నెండు గంటల సమీపాన మోగింది. నారాయణరావుగారు ఫోనులో మాట్లాడి, గుప్తా, మన గురుదేవులు రేపు ఉదయానికల్లా హైదరాబాద్ వస్తున్నారు. ఇక నువ్వు బ్రతికి బట్టకట్టే రోజులు వచ్చాయి. భయపడకు, అని ఎంతగానో నచ్చచెప్పారు. కొద్దిగా నా మనసు కుదుటపడ్డది.

ప్రొద్దున్నే గురుదేవులు వచ్చారు. నేను ఆదుర్దాగా కన్నీళ్లతో గురువుగారికి నా పరిస్థితి చెప్పి నా గాయం చూపించాను. అంతే గురువుగారు ముందు కట్టు కట్టుకోండి భయపడకండి, అందరినీ రక్షించేవాడు సాయినాధుడు అని ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం తెలిసింది గురువుగారు హైదరాబాద్ నుండి శిరిడీ వెళుతున్నారని. నారాయణరావుగారు నాకు ముందుగా బోధ చేసారు. ఇక్కడే ఉండకు, గురుదేవులతో శిరిడీ వెళ్లమని, లేకపోతే ఇక నీవు ఈ భూమిపై ఉండలేవని చక్కగా నచ్చచెప్పారు. నాకు సంసారంతో బంధం చాలా ఎక్కువగా వుండేది. ఆ సమయంలో నేను నాకున్న చిన్న మనసుతో ఆలోచించుకుని, "గురువుగారు, నేను కూడా మీతో శిరిడీకి వస్తాను. తప్పక తీసుకెళ్లి, నన్ను ఈ గండం నుంచి కాపాడమని" వేడుకున్నాను. గురుదేవులు నా మొర ఆలకించి, "సరే మీ ఇష్టం, అక్కడ బ్లడ్ టెస్ట్ చేయించుకోవడానికి వసతులుగాని, సరైన డాక్టర్లుగాని ఉండరు. ఆ విషయం మీకు కూడా తెలుసు. కాబట్టి ఆలోచించుకుని రండి" అని నాతో అన్నారు. నేను మళ్లీ డైలమాలో పడ్డాను. గురుదేవులు దయ వల్ల మళ్లీ వేరే ఆలోచన చేయక, నేను ఎక్కువ కాలం బ్రతకనని ఇక్కడి డాక్టర్లు తెలిపారు కాబట్టి ఆ చనిపోయేదేదో శిరిడీలోనే పోదాం అని, ఒక గట్టి నిర్ణయానికి వచ్చి, గురుదేవులతో వెళ్లడానికి తయారయ్యాను.





గురువుగారితో ప్రయాణం చేస్తున్నంతసేపు నాకు ఎటువంటి బాధా లేదు. రాత్రంతా ప్రయాణం చేసి ప్రొద్దున్నే శిరిడీ చేరాము. శిరిడీలో గురువుగారు వారి ఇంట్లోకి వెళ్లారు. నేను నా గదికి వెళ్లాను. గదికి వెళ్లిన కొద్దిసేపటికే మళ్లీ ఆ గాయం దగ్గర పోటు, బాధ మొదలయింది. మళ్లీ భయం, ఆందోళన, కొద్ది సేపటికి గురువుగారి దగ్గరకు వెళ్లగా, అమ్మగారు ఏమండీ అట్లా ఉన్నారు? ఏమైందని అడిగారు. నా వేదనంతా చెప్పాను. మరి రూములో అంత బాధ పడుతూ ఎందుకు ఉన్నారు? వచ్చి గురువుగారితో మాట్లాడవచ్చు కదా! అని అన్నారు. ఆ ఓదార్పుకే నా మనస్సు ఎంత ప్రశాంతత పొందిందో నేను మాటలతో చెప్పలేను. ఇంతలో గురువుగారు వచ్చారు. నేను మళ్లీ గురువుగారితో అదే విషయం చెప్పాను. గురువుగారు ఏదో హోమియో మందు గోలీలు సీసాలో వేసి, మూతపెట్టి నాకిచ్చారు. ***"దీన్ని మీరు నడిచి ద్వారకామాయికి(మసీదు) వెళ్లి బాబాకి చూపించి, వేసుకోండి. నడచి వెళ్లండి"*** అని మళ్లీ చెప్పారు. సరేనని నేను నడుస్తూ, మధ్య మధ్యలో ఆగుతూ గాయం నుండి వస్తున్న రక్తాన్ని తుడుచుకుంటూ మళ్లీ కొత్తగా బ్యాండేజి మార్చుకుంటూ ద్వారకామాయి చేరాను. భక్తులు అంతగా లేరు. నేను బాబాకి నమస్కారం చేసుకొని మందు సీసా బాబా పాదాలకి తాకించి, వెనక్కి తీసుకోబోతున్న సమయంలో ఆ సీసా జారి బాబా క్రింద వున్న భోషాణంలో పడిపోయింది. ఇక నా పరిస్థితి వర్ణనాతీతం. ఏడుస్తూ, వణుకుతూ బాబా నా మందు నాకు ఇప్పించండి అని హృదయంతో, మనసారా ప్రార్థించాను. అపుడు నాకు అర్థం అయింది. మనసుతో ప్రార్థన చేయడం అంటే ఎట్లాగో, కొద్ది సేపట్లో అక్కడి పూజారిగారు నన్ను చూసి, బాత్ క్యాహువా? బహుత్ దుఃఖిత్ హై? అని అడిగారు. నేను గద్గద స్వరంతో జరిగిన విషయం చెప్పాను. వారు వెంటనే అక్కడి బాబా ముందర వున్న చెక్క బల్ల పైకెత్తి ఆ మందు సీసా తీసి నాకిచ్చి, ఏ హైక్యా! అని ఎంతో చక్కగా నావంక చూసారు. నేను వెంటనే ఆ సీసాలోని గోలీలు నోట్లో వేసుకొని బాబాగారి దగ్గర కొద్దిసేపు కూర్చుని ప్రార్థన చేసుకొని, నాగోడు బాబాకి మళ్లీ చెప్పి, బయటకు వచ్చాను. నడుచుకుంటూ నా రూముకి వచ్చాను.

మొదటి రోజు లాగానే ఇంకొన్ని రోజులు బాబాగారి దగ్గరికి నడిచి వెళ్లి, తిరిగి నడచి వస్తుండేవాడిని. నాలుగవ రోజున మన గురువుగారి ఇంటి ప్రక్కన ఉండే సువిధ హోటల్ కట్టిస్తున్న శ్రీషాకాకా గారు కూడా బాబాగారి గుడికి నేను వెళ్లే సమయానికే వస్తుండేవారు. వారు నేను కుంటుకుంటూ నడవడం చూసి, గుప్తాగారు మీరు చాలా ఇబ్బంది పడుతున్నారు. నా ఆటో రిక్షా వాడుకోండి, మీరు ఫోన్ చేస్తే ఆటో వస్తుంది అని గట్టిగా బలవంతం చేసారు. నేను వద్దంటే వద్దని చెప్పాను. సాయంత్రం గురువుగారి దర్శనానికి వచ్చినపుడు నేను ఆటో వాడుకోనన్నానని నామీద శ్రీ షాకాకా గారు ఫిర్యాదు చేసారు. వెంటనే గురువుగారు నాతో ఆటో వాడుకోండి, మీరు శ్రద్ధగా





నడిచి, నాలుగు రోజులు వెళ్లారు. బాబాగారు మీ పరిస్థితిని చూసి మీకు పుష్పకవిమానం పంపారు అని అన్నారు. నాకు వద్దుసార్, నేను నడిచి వెళ్తాను అని బదులు చెప్పాను. ఎందుకంటే మొదట గురువుగారు పెట్టిన నియమనిబంధనలు నేను జ్ఞప్తిలో వుంచుకొని వద్దని చెప్పాను. మళ్లీ గురువుగారు గట్టిగా చెప్పగా, అట్లాగేనని, నేను రోజూ ఆటోలో పోయి ద్వారకామాయిలో రెండు గంటలు పైగా ఉండి రూముకి వస్తుండేవాడిని. ఇంతలో గురువుగారు బాబాగారి గురుస్థానంలోని వేపచెట్టు ఆకులు తెచ్చి నూరి కుంకుడుకాయంత మాత్రలు చేసి రెండుసార్లు మింగండి అని సెలవిచ్చారు. మన పిల్లలు వేపాకు ఏరుకొని తెచ్చి ఇస్తే, అమ్మగారు నూరి ఇచ్చేవారు. ఈ విధంగా 21 రోజులు గడిచింది.

నా కురుపు కొద్ది కొద్దిగా కండ క్రింద నుండి పెంకు కడుతూ చాలా భాగం తగ్గింది. నాకున్న పోటు, నొప్పి కూడా క్రమేణా తగ్గింది. తరువాత గురువుగారు బెంగుళూరు మీదుగా తిరువన్నామలై వెళ్లడానికి సిద్ధం అవుతుంటే నేను కూడా వారితో వస్తానన్నాను. గురువుగారు సరే మీరు బెంగుళూరు వరకు రండి, ఆ తరువాత తిరిగి ఇంటికి వెళ్లమన్నారు. రైల్లో నేను క్రింద బెర్తుమీద, గురువుగారు నా ఎదురుగా అప్పర్ బెర్తుమీద పడుకున్నారు. రైలు వెళ్తున్న సమయంలో అర్ధరాత్రి నా పై బెర్తు వ్యక్తి కాలు నా గాయం తగ్గిన కాలు పైన పెట్టి క్రిందకు దిగాడు. నాకు మెలకువ వచ్చి, బాబా అని బిగ్గరగా అరిచాను. నా ఉద్దేశంలో నాకు నయమయిన గాయం మొత్తం చితికి పోయిందని, బాగా భయంతో వణికిపోయాను. ఇంతలో పూజ్య గురుదేవులు నిద్ర నుండి లేచి, ఏం కాలేదు, ఏం కాలేదు భయపడకండి అని నన్ను సముదాయించారు. కాసేపటికి నేను యధాస్థితిలోకి రాగలిగాను. ఈ విధంగా నాకు వున్న అమితమైన భయం కూడా పోగొట్టి పూర్తిగా స్వస్థత చేకూరిందని నిరూపణ చేసారు. ఇంకొక విశేషమేమంటే నేను శిరిడీలో వున్న 21 రోజులు ఏ విధమయిన మందులుగాని, ఇంజక్షన్స్‌గాని తీసుకోలేదు. కేవలం మజ్జిగ అన్నంతో నిమ్మకాయ రసం కలుపుకొని, తీసుకోమన్నారు. అలాగే నేను భోజనం చేసాను. నాకు కేవలం జ్ఞాపకంగా మాత్రం నా ఎడమకాలి మోకాలి ప్రక్క ఒక గుర్తు మాత్రం మిగిలింది. నాకు పునర్జన్మను ప్రసాదించి, నన్ను మనిషిగా తీర్చి దిద్దిన గురుదేవులకు నేను సర్వదా కృతజ్ఞుడను.

గురుదేవుల మహాసమాధి అనంతరం గురుబంధువులు అందరూ దుఃఖసాగరంలో వున్నారు. మన గురుదేవులు నవంబరు 13వ తేదీన శరీర త్యాగం చేసి, శిరిడీలో మహాసమాధి రూపులయ్యారు. కేవలం గురుదేవుల స్థూలరూపం మన ఎదుట లేదు కాని, వారు సర్వత్రా సర్వకాలముల యందు మనకు అండగా వుండి మనల్ని సన్మార్గంలో నడిపిస్తారు. ఇది ముమ్ముందు మనందరికి అవగతం అవుతుంది. నమ్మండి.



***–ఎస్.సి.హెచ్.బి.కె. గుప్త, హైదరాబాద్***

# మనస్సుమాంజలి - కృతజ్ఞతా కుసుమాంజలి



జీవితంలోని ప్రతిక్షణాన్ని శ్రీసాయిబాబాకు అంకితం చేసి, శ్రీసాయి పరిపూర్ణ అనుగ్రహంతో జీవనయానం సాగించిన మన ప్రియతమ 'గురుదేవులు' శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ మహాసమాధి చెందారు. నవంబరు 13 శనివారం నాడు దక్షిణ జర్మనీలోని 'ముర్నావ్'లో విదేహులైనారు. అత్యంత అరుదుగా మాత్రమే భువిపై ప్రభవించి, ప్రకాశించే దివ్య తారను ఈ ప్రపంచం కోల్పోయింది. శ్రీసాయిబాబాకు అనన్య భక్తులై, శ్రీసాయిని అనన్యంగా ప్రేమించిన మన గురూజీ సాయి చూపిన మార్గంలో జీవిస్తూ, తమను ఆశ్రయించిన వారికి ఆ సాయిపథాన్ని చూపించారు. శ్రీబాబూజీ తమను ఒక గురువుగా ఏనాడు చెప్పుకోలేదు. ఇంకా, తాను గురువును కాదని విస్పష్టంగా తెలిపారు. అయితే, ప్రేమ, శక్తి, జ్ఞానం ఈ మూడు దివ్య లక్షణాలు కలబోసిన సమర్ధ సద్గురువు శ్రీబాబూజీ అని మనందరి అనుభవం. ***సద్గురువంటే – భక్తులకు అందనంత ఎత్తులో, దివ్య లోకంలో ఉండేవాడు కాదని, మనస్థాయికి దిగివచ్చి, మన చేయి పట్టుకొని నడిపించి, క్రమంగా మనలో పరిణితి కలిగించి, ఉన్నతిని ప్రసాదించే వారే నిజమైన సద్గురువని – శ్రీబాబూజీ అంటారు.***

శ్రీబాబూజీ కురిపించిన ప్రేమ ఆయనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరి జీవితాలను ఆనందమయం చేసింది. శ్రీబాబూజీ మనలను తల్లిలా లాలించి, ప్రేమించారు. నిగూఢ శక్తితో మనకు రక్షణ ప్రసాదించారు. వారి జ్ఞానం మనకు దారి చూపింది. మనకు సంబంధించిన ఏ విషయం శ్రీబాబూజీకి అల్పంగా తోచదు. తనను అడిగిందే తడవుగా ఎవరికైనా, ఎంతైనా ఇవ్వడమేగాని, తిరిగి ఏమీ ఆశించడం, స్వీకరించడం శ్రీబాబూజీ ఎరుగరు. నిజానికి మనం గురువుగారికి ఏదైనా సమర్పించడమనేది అసంభవం. కారణం – శ్రీబాబూజీ అత్యంత నిష్టగా ఆచరించే నియమం – అపరిగ్రహం (శ్రీసాయిబాబా సెంట్రల్ స్కూల్ వ్యవస్థాపకులుగా వారికి గౌరవ భృతి లభిస్తుంది).

శ్రీబాబూజీ తమ వద్దకు వచ్చిన వారి పట్ల అవ్యాజమైన ప్రేమతో వారి స్థాయికి దిగివచ్చి, వారి వారి అవసరాలకు స్పందించి, కోరికలను తీర్చుతారు. అయితే, ఆ ప్రతిభంతా సాయి అనుగ్రహమే అంటారు. చిన్న పాప చాక్లెట్ అడిగితే నవ్వుతూ ఇస్తారు. చదువులో ఇబ్బంది పడే కాలేజి విద్యార్థికి పరీక్షలను ఎదుర్కొనే ధైర్యాన్ని, సానుకూల ఫలితాన్ని ప్రసాదిస్తారు. సాధనలో తొలి అడుగులు వేస్తున్న వారికి అద్భుత, నిగూఢ అనుభవాలనిస్తారు. శ్రీబాబూజీ అనుగ్రహం చేత ఎందరికో అనారోగ్యం కుదిరి, స్వస్థత కలిగింది. దిక్కులేక దిగాలుపడ్డ జీవితాలకు స్వాంతన చేకూరింది. ఎందరో వ్యాపారస్థులు అభివృద్ధి సాధించారు. ఎందరో మేధావులు ఊహకందని ఆయన మేధస్సుకు, అపార





జ్ఞానానికి అచ్చెరువొందారు. ఆ జ్ఞాన సాగరంలో ఓలలాడారు. ఇక పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాల విషయానికి వస్తే శ్రీబాబూజీ చదవని విషయం లేదు. ఆయన ఉదహరించని పుస్తకం లేదు. ఆయన వివరించలేని తత్త్వం లేదు. ఇంతటి అధ్యయనం చేసినా, ఆయన ఆలోచనా విధానం ఆయనకే చెందిన ఒక ప్రత్యేక శైలితో అత్యంత సహజసిద్ధంగా ఉంటుంది.

పాత సాంప్రదాయాలను, పద్ధతులను కూడా నూతన దృక్పథంతో చూస్తారు శ్రీబాబూజీ. వాటిలోని ప్రాముఖ్యతను వివరించి, మనలను ఆవైపు ఉత్తేజితులను చేస్తారు. శ్రీబాబూజీ వద్దకు వచ్చిన క్రొత్తల్లో విదేశీయులు, తమ సాంప్రదాయాలు, చరిత్ర, సాహిత్యం మొదలైన వాటి పట్ల శ్రీబాబూజీకి గల అవగాహన చూసి అచ్చెరువొందారు. ఇంకా, శ్రీబాబూజీ అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడగల్గడం, ఇంగ్లీషు భాషా ప్రయోగంలో తమకంటే ఆయనకే ఎక్కువ పట్టు ఉండడం గమనించిన వాళ్లు అమితాశ్చర్యానికి లోనయ్యేవారు.

శ్రీబాబూజీ సంస్కృత భాషను అధ్యయనం చేసి, అందులో విశేష ప్రావీణ్యం సంపాదించారు. శ్రీబాబూజీకి తమ మాతృభాష తెలుగు పట్ల అపార అభిమానం. తేట తెలుగు అన్నా, తెలుగు నుడికారమన్నా శ్రీబాబూజీకి ఎంతో మక్కువ. ఇక తెలుగు రచనా వ్యాసంగ విషయానికి వస్తే శ్రీబాబూజీ ప్రతి రచనా ఒక అద్భుతం. చదవడం మొదలుపెడితే చివరికంటా చదవనిదే లేవలేని నిస్సహాయతకు గురిచేసి, కట్టి పడేసే ఆయన రచనాశైలి అమోఘం. ప్రతి పదం ఏర్చి, కూర్చి వాక్యాన్ని తీర్చే విధానంలో ఆయనకాయనే సాటి. అటు సంస్కృతంపైనా, ఇటు తెలుగుపైనా, శ్రీబాబూజీకి ఎంత పట్టు, అధికారం ఉన్నాయంటే భాషా పండితులు సైతం తమకు గల సందేహాల నివృత్తి కోసం శ్రీబాబూజీని ఆశ్రయించేవారు.

భారతదేశ సాంప్రదాయాల పట్ల, ఆధ్యాత్మిక చరిత్రపట్ల శ్రీబాబూజీకి ఎంతో గౌరవం ఉంది. అయితే ఇతర దేశాల గురించి, ఆధునిక ప్రపంచంలోని నూతన ఆవిష్కరణల గురించి అధ్యయనం చేయడానికి అది అడ్డంకి కాలేదు. "మనకు తెలిసిన పాత విషయాలనే పట్టుకొని వేళ్లాడడం ఎందుకు? నూతన విషయాలను అన్వేషిద్దాం... పరిశోధిద్దాం... పరిశీలిద్దాం.. మనకు ఉపయోగపడేది ఉంటే గ్రహిద్దాం" అంటారు శ్రీబాబూజీ. అదే స్ఫూర్తితో శ్రీబాబూజీ కంప్యూటర్ టెక్నాలజీని నేర్చుకున్నారు. అతి తక్కువ సమయంలో అటు హార్డ్‌వేర్‌లోను, ఇటు సాఫ్ట్‌వేర్‌లోను నిష్ణాతులయ్యారు. ఆ ప్రజ్ఞ అంతా తమ ఇష్టదైవమైన శ్రీసాయిబాబాను ఇంకా ఇంకా ఆరాధించేందుకు.. అంటే అవిశ్రాంతంగా శ్రమించి, సాయిచరిత్రకు సంబంధించిన అంశాల పరిశోధనకో, లేక సాయిబాబా ఒరిజినల్ ఫొటోని ఫొటోషాప్‌లో పునరుద్ధరించడానికో, మరేదైనా బాబాకు సంబంధించిన అంశాలకో ఉపయోగించారు.





విద్యానగర్ కాలేజీలో శ్రీబాబూజీ విద్యార్థిగా ఉన్నపుడు వారి ఇంగ్లీష్ లెక్చరర్ అయిన మాస్టర్ భరధ్వాజ గారు శ్రీబాబూజీకి సాయిబాబాను తొలిసారిగా పరిచయం చేసారు. అప్పటి నుండి జీవితపు నిగూఢతత్వాన్ని అన్వేషిస్తూ, దీక్షా సంకల్పాలతో శ్రీబాబూజీ సాధన సాగించారు. ఆయన పట్టుదల, ఏకాగ్రత, నిబద్ధత ఆయన చుట్టూ ఉన్నవారిని ఆశ్చర్యానికి గురిచేసేవి.

శ్రీరమణమహర్షి జీవిత చరిత్ర శ్రీబాబూజీని అత్యంత ప్రభావితం చేసి, ఈ జీవిత కాలంలో సాక్షాత్కారం సాధ్యమే అన్న స్ఫూర్తిని ప్రసాదించింది. శ్రీబాబూజీ సాగించిన కఠోర సాధన తమ ఇరవయ్యవ యేట శ్రీసాయిబాబా అనుగ్రహ విశేషంగా శ్రీపూండీస్వామి సన్నిధిలో ఫలప్రదం అయింది. ఆపై 'సాయిబాబా' పత్రిక స్థాపించి, దానిని కొంతకాలం నిర్వహించారు. ఆ తరువాత జనవరి 1, 1988వ సంవత్సరంలో 'సాయిపథం' పత్రిక స్థాపించి, అందుకవసరమైన రచన, మరియు ఎడిటింగ్ స్వయంగా చేసేవారు. ఆయన పరిశోధన పరిపూర్ణం. లోపరహితం. అప్పటివరకు ఎవరికీ తెలియని సాయిబాబా చరిత్ర విశేషాలు, ఒరిజినల్ ఫొటోలను వెలుగులోకి తెచ్చారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ ప్రబోధం సాయిబాబా పరంగా అత్యంత సహజంగా, ఆచరణయోగ్యంగా ఉంటుంది. శ్రీబాబూజీ ఎన్నో అపోహలను, అనవసరపు మూఢనమ్మకాలను పోగొట్టి, సంకుచిత భావాలను ఎండగట్టి, కులమత, ఛాందస భావాలను ఖండించారు. శ్రీబాబూజీ ఉన్నత సిద్ధాంతాలు, అపారమైన మేధస్సు,అత్యంత సునిశిత పరిశీలన, పరిశోధన వారి నిబద్ధతను, క్రమశిక్షణను, శ్రద్ధను సూచిస్తాయి. శ్రీబాబూజీలో వ్యక్తమయ్యే ఉల్లాసం, ఆయన చుట్టూ ఉండే ఆహ్లాదకరమైన వాతావరణం, ఆయన మాటల్లోని జాలువారే సునిశిత హాస్యం... శ్రీబాబూజీకే సొంతం. శ్రీబాబూజీ చెంత అనునిత్యం అనంతపు చిరునవ్వుల జల్లు కురుస్తుంది. తమ చుట్టూ ఉన్న వారిని ఆటపట్టిస్తూ... దానిలో భాగంగా వారిలోని చిన్న లోపాలను, వారి ప్రవర్తనను సరిదిద్దుతూ, సాగే ***శ్రీబాబూజీ వ్యవహారిక సంభాషణ కూడా పరమ సత్యాలను తెలిపే సద్గురు ప్రబోధమనే చెప్పాలి.***

"ఏదైతే మనలను అన్ని రకాలుగా ఉత్తేజ పరుస్తుందో అదే "ఆధ్యాత్మికత" అంటారు" శ్రీబాబూజీ. నిత్యనూతనంగా ఉండే శ్రీబాబూజీ జీవితం ఆ మాటకు నిలువెత్తు నిదర్శనం. తమ గురువు అభీష్టం మేరకు శ్రీబాబూజీ, అనసూయమ్మను వివాహమాడారు. ఆమె ఎవరో కాదు, తమ గురుపత్నికి స్వయానా సోదరి. అత్యంత భక్తి, ఆచారం గల కుటుంబనేపథ్యం, మరియు స్వయంగా సాయి భక్తురాలైన ఆమె శ్రీబాబూజీ జీవన విధానానికి, ఆయన జీవిత లక్ష్యానికి సరైన జోడీగా నిలిచారు. వారి గారాల కుమార్తె శృతి ఆ దంపతుల అసాధారణ ప్రతిభకు, మార్గదర్శకానికి ప్రతీక. తమ





లక్ష్య సాధనకై శ్రీబాబూజీ ఏళ్ల తరబడి ఏకాగ్రతతో కఠోర సాధన చేసారు. ఆ సమయంలో వారి దేహం అలక్ష్యానికి గురైంది. బాబా మీద తప్ప ఇతరుల మీద ఏ విషయం కోసమైనా ఆధారపడకపోవడం శ్రీబాబూజీ వ్యక్తిగత నియమం. అందుకే చివరకు ఆరోగ్యపరంగా కూడా ఆయన ఏ మందు స్వీకరించేవారు కాదు. స్వయానా హోమియోపతి డాక్టరై ఉండి, కొన్ని సంవత్సరాలు ఎంతోమందికి ఉచిత వైద్యం చేసిన శ్రీబాబూజీ – తమ ఆరోగ్యానికి ఏనాడూ మందులు వాడలేదు.

ఇటీవల కాలంలో శ్రీబాబూజీ తరచూ అనారోగ్యానికి గురయ్యేవారు. ఈ సంవత్సరం ఏప్రిల్ మాసంలో శ్రీబాబూజీ తీవ్ర శ్వాస సంబంధిత అనారోగ్యానికి గురయ్యారు. ఆయనకు వైద్యంపట్ల విముఖత ఉన్నప్పటికి భక్తుల బలవంతంపై వైద్య పరీక్షలు చేయగా, ఆయన గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు ఎక్కువ భాగం పూడుకుపోయాయన్న విషయం తెలిసింది. డాక్టర్లు ఆయనకు బైపాస్ సర్జరీ చేయాలని సూచించారు. ఆయన అందుకు నిర్ద్వందంగా నిరాకరించడమే కాక, సూచించిన మందులను సైతం వాడలేదు. డాక్టర్లు ఎంత ప్రాధేయపడినా శ్రీబాబూజీ పట్టించుకోలేదు. దానితో ఆయన ఆరోగ్యం క్షీణించింది. అప్పటికే బలహీనపడ్డ ఆయన హృదయం ఇంకా బలహీనమై పోయింది.

***పరిస్థితి ప్రమాదకరంగా మారిందని స్పష్టమైనప్పటికీ, శ్రీబాబూజీ ఏమాత్రం కలత చెందక, ఏది జరిగినా బాబా ఇచ్ఛకే ఆనందంగా వదిలిపెట్టారు. అంతేగాని, ఏ వైద్య సహాయానికి సుముఖత చూపలేదు.*** చివరకు తమ కుటుంబ మరియు సమీప భక్తుల ఒత్తిడికి లోబడి, ప్రపంచంలో అత్యంత ఆధునిక వైద్యం అందించబడే దేశంగా ప్రఖ్యాతి గాంచిన జర్మనీలో మల్టీస్టెంట్ ప్రొసీజర్‌కి ఒప్పుకున్నారు. అక్కడ హాస్పిటల్స్‌లో అత్యంత ఉన్నత ప్రమాణాలు కలిగిన హాస్పిటల్, మరియు కార్డియాలజిస్ట్‌ని వెదికి, సంప్రదించడం జరిగింది. అక్కడ వసతులు ఏ స్థాయిలో ఉన్నాయంటే స్వయంగా శ్రీబాబూజీ ఆ డాక్టర్‌ను, ఆస్పత్రిని, అక్కడ స్టాఫ్‌ని, వారి పనితనాన్ని, శ్రద్ధను మెచ్చుకున్నారు. స్టెంట్ అమర్చే విధానం సాధారణమైన, పూర్తిగా మత్తు ఇవ్వవలసిన అవసరం లేని, ఒక రోజు హాస్పటల్‌లో ఉంటే సరిపోయే ప్రక్రియ. అయితే, శ్రీబాబూజీ హృదయం చాలా బలహీనంగా ఉందని, చాలా ఆలస్యంగా వైద్య సహాయానికి తీసుకు వచ్చారని ఆయనకు వైద్యం చేసిన డాక్టర్ అభిప్రాయపడ్డారు.

నవంబరు 8, సోమవారం ఉదయం శ్రీబాబూజీకి స్టెంట్ ప్రొసీజర్ చేయబడింది. అంతా సవ్యంగా జరిగింది. ఆ మరునాడు ఆయను డిశ్చార్జ్ చేయవలసి ఉంది. అయితే ఆ రాత్రి శ్రీబాబూజీ హృదయం ఇంకా బలహీనపడింది. ***ఐసియులో ఉంచి, చేయగలిగిన వైద్య సహాయం మొత్తం చేసినప్పటికి అయిదు రోజుల తరువాత నవంబరు 13వ తేదీ భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 1.51 ని.లకు శ్రీబాబూజీ హృదయం ఆగిపోయింది. ఆ సమయంలో అలా హాస్పటల్***





***బెడ్‌పై ఉన్న శ్రీబాబూజీ ముఖవర్చస్సు ప్రశాంతత, రాజసం, సౌందర్యం కలగలసి దివ్యకాంతితో వెలుగుతూ ఉంది.***


శ్రీబాబూజీ మనకు భౌతికంగా దూరం కావడం ఎవ్వరూ తీర్చలేని లోటు అయినప్పటికి ఆయన ఒకానొక సత్సంగంలో పలికిన అనుగ్రహ భాషణం ఇప్పుడు మనకు మార్గదర్శకం. మహాత్ముల వర్ధంతి ఎందుకు ఒక పండుగలా జరుపుకుంటారు అన్న ప్రశ్నకు జవాబిస్తూ శ్రీబాబూజీ ***"ఒక మహాత్ముడు శరీరాన్ని వదిలి పెట్టడం ఆయన అవతార కార్యం, అనుగ్రహం ఇంకా ఎన్నో రెట్లు ఎక్కువగా వ్యక్తమయ్యేందుకు సూచిక"*** అని వివరించారు.

*ఆధ్యాత్మికతను సంక్షిప్తంగా వర్ణించాలంటే – ప్రేమను అనుభవించడం... ప్రేమను వ్యక్తపరచడం* ***అని తెలిపారు శ్రీబాబూజీ.*** శ్రీబాబూజీని తమకు చెందినవారుగా, తాము శ్రీబాబూజీకి చెందినవారుగా భావించే ప్రతి ఒక్కరికీ – జీవితమంటే ఈ రెండే. ఒకటి శ్రీబాబూజీ ఎన్నో రకాలుగా కురిపిస్తున్న అవ్యాజమైన ప్రేమను తనివితీరా అనుభవించడం.. ఆస్వాదించడం, ఆనందించడం. రెండవది శ్రీబాబూజీ పట్ల మనకున్న ప్రేమను మనం చేసే ప్రతి పనిలోను సాధ్యమయినంతగా వ్యక్తపరచడం.అసలైన అందం, ఆనందం యొక్క ప్రాముఖ్యత తెలిసిన శ్రీబాబూజీ ఎక్కడున్నా, తమ చుట్టూ ఆధ్యాత్మిక అందాన్ని, ఆనందాన్ని వికసింపచేసారు. జీవితంలో రసానుభూతి యొక్క ప్రాముఖ్యతను తిరిగి, తిరిగి మనకు తెలిసేలా చేసారు.

**మహాత్ములలో ఆణిముత్యం శ్రీబాబూజీ. శ్రీబాబూజీ గొప్ప గురువు. తమ వద్దకు వచ్చిన కఠిన శిలల వంటి వారిని కుసుమకోమలంగా మలచిన గొప్ప శిల్పి. జీవితాలను సుందరంగా తీర్చిదిద్దిన చిత్రకారుడు. జీవితంలోని అసలైన మాధుర్యాన్ని రుచిచూపి, జీవితపు అసలు అర్థం ప్రేమ అని శ్రీబాబూజీ తెలియచెప్పారు. శ్రీబాబూజీ తమ దివ్యప్రేమతో మనందరిని అనుగ్రహించుగాక!** *– సాయిబాబా.కామ్ నుండి సంగ్రహం*

## శిక్షణ... కంటికి రెప్పలా రక్షణ

గురుదేవులు చెప్పింది సరిగా చేయక తరువాత జరిగిన దాని పర్యవసానం ఎలా ఉంటుందో చెప్పే అనుభవం మీ అందరితో పంచుకుంటున్నాను. నా పేరు మోహన్‌రావు గుప్తా. నేను నా భార్య (మధుశ్రీ) శిరిడీకి వెళ్లాము. అపుడు ఒకరోజు గురుదేవులు కాలనీలోని అందరి ఇళ్లలోనికి నీరు రావడానికి మరియు ఆ నీరు ట్యాంకులకు చేరడానికి పైప్ లైన్ వేసే పనిని అప్పచెప్పారు. వెంటనే కోపర్‌గాం వెళ్లి ఈ పైపులైనుకు సంబంధించిన సామానులు తెచ్చాను. ఆ సమయమున భానుమూర్తిగారు కూడా శిరిడీలో గురువుగారి వద్ద ఉన్నారు. వారి సలహాలు తీసుకుని పని పూర్తిచేసినాను. మోటారు వేయగా ఆ పైపులైన్ల జాయింట్ వద్ద లీకులు ఉండుట వలన నీరు రాలేదు. ఆ లీకులు





సరిచేయకుండా భానుమూర్తిగారితో మీరు ఇవి చేయండి అని చెప్పి నేను గుంటూరుకు బయలుదేరాను. ఎవరన్నా శిరిడీ నుండి తిరుగు ప్రయాణము చేయునపుడు మధ్యాహ్నం 2.30 లేక 3.00 గంటలకు గురువుగారు వెళ్లేవారిని పిలిచి, ఊదీ ఇచ్చి, పంపారు. ఎవరైనా ఆటోలో లేక కారులో వెళ్లేటపుడు ఇంటి అరుగుమీద నిల్చుని, ఆ బండి రోడ్డు దాటే వరకు వీడ్కోలు చెప్పేవారు. కాని నా ప్రయాణము రోజున గురుదేవులు మూడున్నర వరకు నిద్రపోయినారు. అపుడు వారు లేచి అమ్మగారితో ఏమిటో నిద్ర వచ్చినది, మోహన్‌ను పిలువు. ఇంటికి వెళుతున్నాడు కదా! అని చెప్పగా అమ్మగారు నన్ను పిలిచారు. ఆ సమయములో ఎంత ఆందోళనగా ఉన్నానంటే ఇంకా గురువుగారు పిలువలేదు ఎలా ప్రయాణము అని అనుకుంటున్నాను. అపుడు అమ్మగారు పిలవగానే వెంటనే గురుదేవుల వద్దకు వెళ్లి ఊదీ పెట్టించుకుని బస్టాండు వెళ్లాను మన్మాడు వెళ్లుటకు. బస్సు లేటుగా బయలుదేరినది. సాయిపథం నుండి బయలుదేరినపుడు అమ్మగారు ఒక అట్టపెట్టెను సంచిలో పెట్టి దీనిని హైదరాబాద్ నారాయణరావుగారి ఇంటిలో ఇవ్వమన్నారు. నావి రెండు లగేజీలు. మొత్తం మూడు అయినవి. నా భార్య శిరిడీలో ఉండి పోయినది. అందువలన ఈ మూడు నేను తీసుకువెళ్లవలసి వచ్చినది. నాకు లగేజి తీసుకెళ్లుట అంటే మహాబద్ధకం. అమ్మగారు చెప్పారని సరే అన్నాను.

ఎలాగయితే మన్మాడు బ్రిడ్జి మీద బస్సు దిగి మూడు లగేజీలు మోసుకుంటూ వెంటనే రైల్వేస్టేషను చేరి, మెట్లు ఎక్కుతుండగా నేను ఎక్కవలసిన అజంతా రైలు బయలుదేరి వెళ్లిపోయినది. ఇంక చూడాలి నా పరిస్థితి. నాకు లేటుగా ఊదీ ఇచ్చి పంపినందుకు, వెంటనే బస్సు దొరకనందుకు గురువుగారి మీద, బాబామీద బాగా కోపము పెరిగిపోయినది. ఎవరికన్నా రైలు మిస్ అయినచో వారు మన్మాడ్‌లోనే ఉండి తరువాత రైలుకు వెళతారు. నాకు ఉన్న దురలవాటు కూర్చోవడానికి, పడుకోవడానికి బాగుండాలి. అదీకాక, నా భార్య శిరిడీలోనే ఉన్నది. అందుకని వెంటనే బస్సు ఎక్కి శిరిడీ చేరాను. ఇంకా కోపము తగ్గలేదు. ఇంకా ఎక్కువయినది. అపుడు నా భార్యతో నేను "ఇంక శిరిడీ లేదు, బాబా లేదు, గురువుగారు లేరు, నువ్వు నీ బట్టలు సర్దుకో రేపు మనము ఇక్కడి నుండి వెళ్లిపోదాము" అని బాగా కోపముగా పెద్దగా అరిచాను. ఇవన్నీ గురుదేవులకు, అమ్మగారికి మరియు భానుమూర్తిగారికి వినపడినది. వారి నవ్వులు నాకు వినపడినవి. ఆ కోపముతోనే అమ్మగారు పెట్టిన అన్నం తిన్నాను. రాత్రి 10.30కి గురువుగారు రమ్మంటున్నారని కబురు వచ్చినది, వారి వద్దకు వెళ్లి నమస్కరించుకుని కోపంగా కూర్చున్నాను. అపుడు గురుదేవులు నవ్వుతూ బాబా సచ్చరిత్ర తెరచి ఈ విషయం చదవమని చెప్పారు. దానిలో మసీదు మరమ్మతులు చేసేటపుడు సాయిబాబాతో పురందరే ఈ పనులు పూర్తి చేసి వెళ్లమని చెపుతారు. మరి నేను పైపులైను పని పూర్తి చేయకుండా భానుమూర్తిగారికి అప్పచెప్పి వెళ్లినాను. అందుకనే





నేను వెనక్కి రావలసి వచ్చినది అని గురువుగారు చెప్పినారు. వెంటనే నా తప్పు నేను తెలుసుకొని గురువుగారికి క్షమాపణ చెప్పి, తెల్లవారి పైపులైను పని పూర్తి చేసి హాయిగా ఇంటికి వెళ్లాను. నా భార్యతో శిరిడీలో కొన్ని రోజులు ఉండి నేను, నా భార్య ఇంటికి చేరాము. గురుదేవులు చెప్పిన పని పూర్తి చేయకుండా శిరిడీ వదిలిపెట్టే పొరపాటు చేసాను. నేను వెళ్లినా, నా తప్పు నేను తెలుసుకునేటట్లుగా చేసారు. అనుభవాన్ని అంటిపెట్టుకొనే ప్రయత్నం చేసాను ముందుకాలంలో! ఇంకొకరికి పని మధ్యలో అప్పచెప్పడం సరికాదని... సాయిపథంలో! కనుక గురుదేవులకు మాట ఇస్తే అది చేసి తీరాలి.

*– గుప్తా, హైదరాబాద్*

## అందరి బంధువయ్యా!

లక్ష్యం మహోన్నతంగా ఉంటే సాధన సంధించిన బాణంలాగా గమ్యం చేరుతుంది. మార్పు అనేది కాలానుగుణంగా పరిణితి చెందుతూ సమాజానికి అనుగుణంగా అన్వయించబడి, క్రొత్త రూపాంతరంగా వెలుగుచూస్తుంది. చరిత్రలూ, ఉదాహరణలు కూడా అలాగే ఉన్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను మహాఋషులు, మహా పురుషులు, తత్త్వవేత్తలు, సాహిత్యకారులు జీవిత మనుగడకు సామీప్యానికి చేరుస్తూ, తమదైన శైలిలో క్రొత్త ఒరవడిలో గురుబోధలను, గురు ఆచరణాలను ఆస్వాదిస్తూ, అభిలషిస్తూ, ఆచరిస్తూ వారి తత్వాన్ని, జన సామాన్యానికి ఆచరణా యెగ్యంగా మలచి, మార్గదర్శకులై సద్గురువుగా పిలువబడతారు. అట్టి వారిలో గురూజీ ఒకరై, గురుబంధువులకు బంధువుగా శాశ్వత స్థానాన్ని పొందారు.

శ్రీశరత్‌బాబుగారు విద్యార్థి దశనుండే ఒక నిర్దిష్టమైన అభిప్రాయంతో, సత్యాన్వేషణలో దృఢసంకల్పంతో తమ ఆంగ్ల బోధకులు భరద్వాజగారు వివిధ సందర్భాలలో చేసిన సత్సంగాల సారంలో ఓలలాడి గురువుకు తగ్గ శిష్యులుగా అడుగులు వేసారు.

అనంతర కాలంలో సాయి మార్గాన్వేషణలో సాయి బోధలను, సూక్తులను నిజ జీవితంలో ఆచరణ పూర్వకంగా మలచుకొని, ఎందరో సాయి భక్తులకు గురుదేవులైనారు. బాబా బోధనలలోని "సత్యాన్ని అంటిపెట్టుకో, నేనెప్పుడూ నీ చెంతనే ఉంటాను" అన్న సూక్తిని తన జీవితానికి నేపథ్యంగా చేసుకొని చివరివరకు అకుంఠిత దీక్షతో ఎందరికో ఆచరణాత్మక గురుదేవులైనారు.

సత్యం పట్ల వారి కున్న నిబద్ధతకు నిదర్శనమే వారి పెన్ నేమ్ "సత్యకామ" (సత్యం పట్ల కోరిక కలిగినవారు) గాంధీగారి దృఢదీక్ష, సత్య సంధత, త్యాగనిరతి వారికి పెట్టని



కోటలు. భగవాన్ రామకృష్ణ పరమహంస, వివేకానంద, గౌతమబుద్ధ, నిత్యానందస్వామి, వాసుదేవానంద మొ॥వారి చరిత్రలు వారికి స్ఫూర్తిదాయకాలై ఇంకా ముందుకు నడిపించాయి. గురూజీ తన వద్దకు వచ్చే వారికి ఎవరికీ ఏమీ బోధించేవారు కాదు. "నేను ఎవరికీ ఏమీ చెప్పను, నేర్చుకునేలా చేస్తాను" అన్న సత్యాన్ని ఎందరి జీవితాలలోనో నిజం చేసారు. ఆధ్యాత్మికతలో పడికట్టు పదాలైన ప్రారబ్ధము, కర్మ, ముక్తి, మోక్షం, ఆత్మ, పరమాత్మ లాంటి విషయాలలో థియరీ కన్నా ప్రాక్టికల్‌కే ఎక్కువ స్థానం ఇచ్చారు.

మనకు తెలియనివి, జీవితంలో ఎవ్వరూ ఎన్నడూ చూడనివి అయిన "స్వర్గం, నరకం. ఇది చేస్తే అది వస్తుంది ముందు జన్మలలో ఇలా..." అని అంటూ "ఎపుడో మనకు తెలియని స్థితిలో జరిగే వాటి గురించి ఆలోచించడం, ఆందోళన చెందడం కంటే బాబా మీద నమ్మకం ఉంచి, ఇపుడు ఉన్న స్థితిని అనుభవించగల దృఢచిత్తమే మన జీవితానికి కావాలి" అనేది వారి మార్గం – మనకు మార్గ దర్శకం.

మూఢంగా దేనినీ ఆచరించడంగాని, ఒకరికి చెప్పడంగాని వారు ఎరుగరు. ఒకేదైవం, ఒకే ధ్యానం, ఒకే ధ్యేయంగా వారి మార్గం నడిచింది. చైతన్యమే సృష్టి. శబ్ధం నుండే నిశ్శబ్ధం. అదే మౌనం. ఆ మౌన రూపమే వారు విశ్వసించిన "సాయిబాబా". ఆ తత్త్వానికి రూపాలు వారు సందర్శించిన మహాత్ములు. ఆ త్రోవలోనే వారి అన్వేషణ. ఆ అన్వేషణలో వారికి లభించిన ఆలంబన శ్రీభగవాన్ రమణ మహర్షి. వారి జీవిత విధానంలోనూ సాయితత్త్వాన్ని దర్శించారు. బాబా శిరిడీలో అడుగిడిన పర్యంతం 60 సం॥లు దానినే స్థిర నివాసంగా చేసుకున్నారు. మధురైలో ఆత్మ సాక్షాత్కారం పొందిన భగవాన్ రమణ మహర్షి కూడా అరుణాచలమే తమ జీవిత పర్యంతం స్థావరంగా చేసుకొని "నేనెవరు"? అనే మాటలతో ఎందరికో మార్గదర్శిగా వెలుగొందారు. గురూజీ సైతం ఆ మార్గంలోనే పయనించారు.

నిరంతర సాయితత్త్వ సాధనే పరమావధిగా సాగుతున్న గురువుగారి జీవితంలో లభించిన మరియొక సాయి చైతన్యస్ఫూర్తి – మూర్తి "పూండీస్వామి". స్వామి నిజరూపం వారికి గురు ప్రసాదంగా లభించిన పూర్ణ చైతన్యం. వారి దర్శనంతో గురూజీ సాధకులుగా పరిపూర్ణులైనారు. ఎందరి జీవితాలలోనో ఉన్న వ్యధలకు ఒక పరిష్కారంగా తనకు అప్పజెప్పిన పనిని త్రికరణశుద్ధిగా బాబాకు నివేదించి, తను సాయిపథంలో నడుస్తూ, తన బంధువులను నడిపిస్తూ "సాయిబాబా" అనే నాలుగు అక్షరాల మాటనే మంత్రంగా, సూత్రంగా మనకు ప్రసాదించారు. ఆ పయనంలో గురూజీ చేరిన తీరమే "సాయియానం" అదే – సాయిలో ఐక్యం.

*–విస్పందన*


ఇతరుల విమర్శలను మనలోని బలహీనతలను తొలగించుకోవడానికి ఉపయోగించుకోవాలి

# మూలానికి మూలం... ప్రేమ కరవాలం



గురుబంధువులకు నమస్కారము. నాపేరు డా॥ శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలులో వైద్యవృత్తి. శ్రీసమర్ధ సద్గురు సాయినాధుని అనుగ్రహ ఫలంగా సద్గురు బాబూజీ వారి సన్నిధి భాగ్యం లభించింది. శ్రీబాబూజీ వారి కృపతో వారి నుండి ఉపదేశయోగ్యతా లభించింది. సాయినాధుల వారు కూడా వారి మొత్తం జీవితంలో ఒకసారి ఒక భక్తునితో నేను అల్లాను (మై అల్లా హు) అని చెప్పారని, ఎప్పుడూ నేను అల్లా బానిసను అనేవారు ఒకే ఒకసారి అలా చెప్పారని సాయిచరిత్రలో ఉంది. అలాగే శ్రీబాబూజీ వారు కూడా ఒక సందర్భంలో వారు నిజ(స్వ)స్థితిని ఒక సన్నివేశం ద్వారా నాకు తెలియపరిచారు. ఆ సందర్భాన్ని మీతో పంచుకుంటున్నాను.

శ్రీబాబూజీ ఒంగోలులో స్కూలు నడుపుతున్న రోజులవి. వారితో కలసి, మెలసి జీవించగలిగే భాగ్యం కలిగింది. వారు ఒకసారి నాకు ఏదోపని చెప్పారు. ప్రతి పనిని నాలో అవగుణాలను పోగొట్టి నా సాధనకు దోహదం చేసేటట్లుగా నాచేత చేయించేవారు. నా అలసత్వం వలన, సోమరితనం వలన ఆ పనిని చేయలేదు. పని అయిందా అని అడిగారు. చేయలేదు చేస్తాను అని చెప్పాను. రెండు రోజుల తరువాత మళ్లీ అడిగారు. మళ్లీ చేయకపోగా ఏదో సాకు చెప్పి తప్పించుకున్నాను. ఏమీ మాట్లాడకుండా ఉండిపోయారు. మళ్లీ నేను ఆ పని చేయలేదు. రెండురోజులాగి మళ్లీ 'చేసారా'? అని అడిగారు. అప్పటికీ చేయలేదని చెప్పకుండా ఏ విధంగా అబద్ధం చెప్పి తప్పించుకోవాలా అని కారణం వెదుకుతున్నాను.

నాలోని అబద్ధానికి రూపు ఏర్పడక ముందే వారు నావైపు ఒకసారి సీరియస్‌గా చూసి "ఏమనుకుంటున్నారు? నేను మీ SOURCE OF THOUGHT (ఆలోచనకు మూలం) కంటే కూడా లోతుగా వున్నాను" అని చూపుడువేలు చూపుతూ కోపంతో (జాగ్రత్త అన్నట్లు) అన్నారు. ఒక్కసారిగా లోపల వణుకు పుట్టింది. అబద్ధం చెప్పాలన్న తలంపు విరిగిపోయింది. నా మీద నాకు అసహ్యం వేసింది. నా మనస్సు స్తబ్దుగా మారిపోయింది. వారిని చూడాలంటే సిగ్గు, భయం పుట్టి వారి ముఖంలోకి చూడలేకపోయాను. భగవాన్ రమణమహర్షి మనలోని 'నేను'ను చూసుకునేటపుడు SOURCE OF THOUGHTను చూసుకో అంటారు. ఆలోచనల మూలం కన్నా అంతర్లీనంగా నాతో వున్నారంటే సద్గురు దేవులు ఏమై వుండాలి? నాలో ఉండే వారి ఎఱుకను ఆ క్షణం నుండి అన్వేషిస్తూనే ఉన్నాను. నా అన్వేషణ అంతమయ్యేది ఎప్పుడో సద్గురుదేవులకే ఎఱుక. వారి కృపతో తప్ప నా అన్వేషణ పూర్తికాదు. నాలోనే గూఢంగా వున్న నా సద్గురుదేవునికి నా మనస్సనే సుమాన్ని అర్పిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

*– శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు*



# చేరెను సాయిపదము... చేర్చెను సాయిపథము



పూజ్యశ్రీసాయినాథుని శరత్‌బాబూజీ గారి పాద పద్మములకు నమస్కరించి, గురువుగారు నాకు ఇచ్చిన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను. గురువుగారు మహాసమాధి చెందారని నాకు 13.11.2010 శనివారం సాయంత్రం 5 గం॥లకు తెలిసినది. గురువుగారు లేరని చాలా లోలోపల బాధపడుతున్నాను. దుఃఖం ఆగట్లేదు. సత్సంగంలో షిర్డికి బస్సు వేస్తున్నాము. వచ్చేవారుంటే పేర్లు ఇవ్వండి అని చెప్పారు. నేను వెంటనే పేరు ఇచ్చాను. ఆరోజు రాత్రి 8.30ని॥లకు బస్ రద్దు చేసారని అన్నారు. నాకు ఏమి చేయాలో అర్థం కాలేదు. నా ఫ్రెండ్స్, ట్రెయిన్‌కి వెళ్తామని చెప్పారు. నేను వాళ్లతోపాటు బయలుదేరాను. 14.11.10 తెల్లవారుఝామున నాలుగు గంటలకు తెనాలి నుండి గుంటూరుకు పల్నాడు లింక్ బస్ ఉంది. ఆ బస్‌కు బయలుదేరి గుంటూరులో పల్నాడు ట్రెయిన్ ఎక్కాము. మాకు సికింద్రాబాద్ నుండి షిర్డీకి రిజర్వేషన్ లేదు. నా ప్రక్కనే ఉన్న నా ఫ్రెండ్ సత్యన్నారాయణ సికింద్రాబాద్ ట్రావెల్స్‌కి ఫోన్ చేసి రిజర్వేషన్ అడిగితే, ఎక్కడా ట్రావెల్స్‌లో రిజర్వేషన్ లేదు అన్నారు.

మాతోపాటు సికింద్రాబాద్‌కు ప్రయాణిస్తున్న అతను మా ప్రక్కనే కూర్చున్నాడు. మేము ట్రావెల్స్‌కు ఫోన్ చేయడం చూసి అతను మమ్ములను అడగకుండానే ఫోన్ చేసి, "మీరు కంగారు పడవద్దు!" మీరు సికింద్రాబాద్ దిగేసరికి నేను షిర్డికి రిజర్వేషన్ ఇప్పిస్తాను" అన్నాడు. మాకు తెలియని మనిషి మా కోసం అన్ని ఫోన్స్ చేసి మాకు రిజర్వేషన్ ఇప్పిస్తా అనేసరికి మాకు మా ఆలోచనలు అన్ని ఆగిపోయాయి. సికింద్రాబాద్ వచ్చే అరగంట ముందు మీకు మూడు టికెట్లు రిజర్వేషన్ అయ్యింది. అమీర్‌పేట కల్పనా ట్రావెల్స్‌లో మీకు రిజర్వేషన్ కన్‌ఫర్మ్ అయ్యింది. మీరు వెళ్లి టిక్కెట్టు తీసుకోండి అని చెప్పాడు. మేము ట్రావెల్స్‌కి వెళ్లి అడిగాము. టికెట్టు మా చేతికి ఇచ్చాడు. "ఇలా గురువుగారు ఒక గొప్ప లీలను మాకు ఇచ్చారు. గురువుగారు శరీరులుగా లేరు అని మా మనసుకి అనిపిస్తుంటే నేను సర్వాంతర్యామినై మీతోనే ఉన్నాను అంటూ వారికి మా పట్ల ఉన్న ప్రేమను, మా చుట్టూ వున్న అపరిచితవ్యక్తుల ద్వారా కూడా అందించారు. సదా మనందరిపై సద్గురుదేవుల అనుగ్రహాశీస్సులు వర్షించుగాక! ***–సునీల్‌కుమార్, తెనాలి***

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**
సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**
గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**





## “ ? ”

శ్రీసాయిబాబా మరియు పూజ్య గురుదేవులు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీకి నా హృదయపూర్వక నమస్కారములు. పూజ్య గురుదేవుల ఆరాధనోత్సవానికి పబ్లికేషన్స్ తరపున ఏదో ఒకటి చేయాలనే నా ఉత్సుకతకు గురుదేవుల అనుగ్రహంతో రెండవసారి నా అనుభవాన్ని గురుకృపతో పంచుకునే అవకాశం ఇప్పించారు. నా పేరు మనోహర్, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. 1994లో శ్రీసాయిబాబాతో పరిచయం, అటు కొద్ది కాలానికే గురుదేవుల పరిచయంతో వారితో నా అనుబంధం ఈ రోజు వరకు వారి అనుగ్రహంతో కొనసాగుతూనే  ఉంది. ఈ రోజున గురుదేవులు భౌతికంగా లేరు అన్నది స్ఫురణలోకి వస్తే అది ఎంత తీరని లోటో అనేటు వంటిది ప్రతి ఒక్క గురుబంధువు సహజంగా అనుభవిస్తున్నటువంటి విషయం. ఇన్ని సంవత్సరాల అనుబంధంతో వారిని ఎంతమటుకు ఉపయోగించుకున్నాం? వారి నుండి ఎంత నేర్చుకున్నాం? అనే ప్రశ్న  నేను వేసుకుంటే పెద్ద క్వశ్చన్ మార్క్ మాత్రమే మిగులుతుంది. గురుదేవుల నిర్ణయం ఏనాడూ ఊహించనటువంటి విషయం. కాని ఈరోజు కూడా కూర్చుని ఆలోచిస్తే శిరిడీలో జరిగినటువంటి వారి సమాధి కార్యక్రమం అంతా ఓ కలలాగ ఉంది. ఇది జరిగిందా! అని అనిపిస్తుంది. గురుదేవులను మొదటి నుండి భగవత్ రూపంగానే భావిస్తూ వచ్చాను. కాబట్టి వారు భౌతికంగా లేరు అన్న నిజాన్ని తట్టుకునే శక్తిని వారే ప్రసాదించారు. గతంలో వారి దర్శనంలో జరిగిన సంఘటనలు, మరియు వారు ఇచ్చిన అనుభవాల వలన వారు నాతోనే ఉన్నారు అని ప్రగాఢంగా భావిస్తున్నాను. గురుదేవులు నాకు ఇచ్చిన అనుభవాలు నా దృక్పధాన్ని బట్టి కూడా ఉన్నాయి. కానీ ముఖ్యంగా మనిషి జీవితంలో జరిగే ముఖ్యమైన ఘట్టంలో ఆయన సహాయం ఎలా ఉంటుందనే దానికి నాకు జరిగిన అనుభవం మీతో పంచుకుంటున్నాను. 1997లో నేను బెంగుళూరులో ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యాను. 1998లో సిగరెట్ త్రాగడం అలవాటయ్యింది. అప్పటినుండి ఎనిమిది సంవత్సరాలు సిగరెట్ త్రాగేవాడిని. 2003లో నాకు ఆర్థ్రయిటిస్ వచ్చింది. అయితే ఆర్థ్రరైటిస్ వచ్చినవాళ్లు సిగరెట్ త్రాగకూడదని ఎవరో చెప్పారు. అయినా నేను పట్టించుకోలేదు. శిరిడీలో గురువుగారి దర్శనంలో మాత్రం నా సమస్య గురించి ప్రతిసారి చెప్పేవాడిని. ఆయన ఎప్పుడూ సమాధానంగా ఏదీ చెప్పేవారు కాదు.

అయితే ఒకరోజు ఆఫీస్‌లో నైట్‌షిఫ్ట్ చేసి వచ్చి బ్రేక్‌ఫాస్ట్ చేసి బయటకు వెళ్లి ఒక సిగరెట్ త్రాగి వచ్చి పడుకున్నాను. స్వప్నంలో గురుదేవులు కనిపించారు. నేను నులక మంచం మీద పడుకుని ఉన్నాను. ఆయన నా దగ్గరకు వచ్చి నిలబడ్డారు. నేను లేవకుండా పడుకునే ఉండి వారికి నమస్కరించి సిగరెట్ త్రాగడం మానివేయమంటారా? అని అడిగాను. అందుకు ఆయన





తల అడ్డంగా ఊపారు. నాకు అర్థం కాక మరల సిగరెట్ త్రాగడం మానివేయమంటారా అని మరల అడిగాను. అందుకు ఆయన మరల తల అడ్డంగా ఊపి, దానివలన ఎప్పటికయినా ఎఫెక్ట్ ఉంటుంది అన్నారు. వెంటనే మెలకువ వచ్చి పూలప్రసాద్‌గారికి ఫోన్ చేసి ఇలా గురుదేవుల స్వప్నం గురించి చెప్పాను. అప్పటి నుండి సిగరెట్ త్రాగడం మానివేద్దామనుకున్నాను. కాని అప్పుడప్పుడూ త్రాగుతూ ఉన్నాను. కాని ఒకరోజు మన గురుబంధువు ఒకాయనతో ఈ విషయం చర్చించినపుడు అతను గురువుగారికి ఏదైనా నియమం పెట్టుకొని చేయడం అంటే చాలా ఇష్టం. అందువలన పూర్తిగా మానివేయమని చెప్పాడు. ఆరోజు నుండి పూర్తిగా ఆ వ్యసనాన్ని వదిలి వేసాను. అయితే కొన్ని రోజుల తరువాత ఈ విషయం గురించి ఆలోచిస్తే అపుడు గురుదేవులు చేసిన అద్భుతమైన లీల నాకు అర్థం అయింది. ఎనిమిది సంవత్సరాలనుండి ఒక వ్యసనానికి బానిసగా ఉన్న నాకు, ఎన్నోసార్లు మానివేయాలని ప్రయత్నం చేసి, మానేయలేకపోయిన నాకు గురుదేవులు స్వప్న దర్శనంతో ఆ బలహీనతపై నాకు ఆదేశాలు ఇచ్చారు. నాకు నేను గమనించుకుంటే ఈరోజుకి ఒక పది మంది నా ప్రక్కన కూర్చుని సిగరెట్ త్రాగుతున్నా, త్రాగమని బలవంతపెట్టినా నేను ఏ మాత్రం చలించని స్థితికి వచ్చానని, గురువుగారు నన్ను ఏ విధంగా అనుగ్రహించారో అర్థం అయింది. తమ అనుగ్రహశక్తి నా చంచల మనఃస్థితికి స్థిరత్వాన్ని చేకూర్చిందనిపించింది. ఈ రోజుకి నాకు ఎప్పుడూ సిగరెట్ త్రాగాలని అనిపించినా వారు ఇచ్చిన శక్తితో ఆ కోరికను అధిగమిస్తున్నాను. నా వివాహం గురుదేవుల చేతుల మీదుగా శిరిడీలో బాబా సన్నిధిలో, సాయిపథంలో జరిగింది. అపుడు స్టేజీమీద వారిని నా ఆరోగ్య విషయం గురించి మరల అడిగాను. వారు ఏ రోజూ లైన్‌లోని దర్శనంలో ఆరోగ్యం గురించి అడిగితే ఏ సమాధానం చెప్పలేదు, కానీ వారు నన్ను ఆరోగ్యపరంగా ఎప్పుడూ కాపాడుతున్నారని పై అనుభవం వలన గాఢంగా నమ్ముతున్నాను. ఈ లీల నాకు గురుదేవులు ఇచ్చిన అనుభవంలో ఇష్టమైన లీల. నా వివాహం విషయంలో గురుదేవులు అత్యంత శ్రద్ధ తీసుకొని అపారమైన అనుగ్రహాన్ని అందించారు. 25 ఏళ్లకే ఆర్థ్రరైటిస్ వచ్చి, స్థిర ఉద్యోగం లేని నాకు మన గురుబంధువు అయిన సుప్రజతో వివాహం అయ్యేట్లు అనుగ్రహించారు. మా ఎంగేజ్‌మెంట్ ఒంగోలులో జరిగింది. అపుడు ఒక అద్భుతమైన లీలను గురుదేవులు నాకు అనుగ్రహించారు. మేము పదమూడవ తేదీన ఉదయాన్నే బస్ మాట్లాడుకుని మా వీధిలో వున్న వాళ్లు, మా బంధువులు, అందరం కలసి మా నాన్నగారు చెప్పిన ప్రకారం మంచి టైమ్ చూసుకుని ఉదయాన్నే ఏడు గంటల కల్లా తెనాలిలో మా ఇంటి దగ్గర నుండి దాదాపు నలభై మంది ఎంగేజ్‌మెంట్‌కి ఒంగోలు బయలుదేరాము. పది గంటలకల్లా ఒంగోలు చేరుకొని, బ్రేక్‌ఫాస్ట్ చేసి, కొద్దిగా విశ్రాంతి తీసుకొని 11.40కి అనుకున్న ముహూర్తం ప్రకారం నిశ్చితార్థం చేసుకోవాలని మా వాళ్ల ప్రణాళిక. అయితే





మేము ఏడు గంటలకు బయలుదేరి తొమ్మిది గంటల ప్రాంతంలో చిలకలూరిపేటకు పది మైళ్ల దూరంలో ఉండగా బస్‌కి వెనుకప్రక్క వున్న రెండు టైర్‌లు బరస్ట్ అయ్యాయి. అయితే అది తెలియని మేము పంక్చర్ అయి ఉంటుందనుకుని అరగంటపాటు ఆ రోడ్డు మీదనే ఎదురుచూసాము. తరువాత మా బావగారు మెకానిక్‌తో మాట్లాడి రెండు టైర్‌లు బరస్ట్ అయ్యాయని, ఓనర్‌కి చెప్పి, యాభైవేల రూపాయలతో విజయవాడ నుండి కొత్త టైర్‌లు తెచ్చి బాగు చేసేటప్పటికి సాయంత్రం అవ్వవచ్చని మాకు చెప్పారు. అది విన్న నాకు ఒక్కక్షణం ఏమి చేయాలో అర్థం కాలేదు. ఎందుకంటే సుప్రజ వాళ్లు మరియు చాలా మంది గురుబంధువులు ఒంగోలులో మా గురించి ఎదురుచూస్తున్నారు. అయితే నేను ఒక్కసారి బాబా, గురువుగారిని తలచుకుంటూ, రోడ్‌వైపు చూస్తున్నాను. బాబా, గురుదేవుల అనుగ్రహం ఎటువంటిది అంటే నన్ను ఎక్కువసేపు పరీక్షించకుండా, ఒక ఆర్టీసి బస్ వచ్చింది. నేను చేయి ఊపగానే డ్రైవర్ బస్ ఆపి, మేము పరిస్థితి చెప్పగానే అందరినీ బస్ ఎక్కించాడు. బాబా గురుదేవుల అనుగ్రహం ఎంత అపారం అంటే దాదాపు బస్ మొత్తం ఖాళీగా ఉంది. కొద్ది మందికి తప్ప అందరికీ సీట్లు దొరికాయి. నిలబడి ఉన్న కొద్దిమందికి చిలకలూరిపేటలో సీట్లు దొరికాయి. ఈ రోజుకీ ఈ అనుభవం గురించి నేను ఆలోచిస్తే ఆయన ప్రేమ ఎలా ఉంటుంది అంటే ఇలా ఉంటుంది అనిపించి కళ్ల నీళ్లు వస్తాయి. ఆ రోజుల్లో మైనతాయికి ప్రసవవేదన తీర్చడానికి బాబా గుఱ్ఱం బండితో వచ్చారని నాకు సత్సంగంలో చెప్పారు. అదే విధంగా ఈ సంఘటనలో బాబా-గురుదేవులు బస్ పంపించారని నాకు అనిపించింది. తరువాత మేము 11.10కి ఒంగోలు చేరి, 11.20కి ఫంక్షన్ హాలుకి చేరి, అనుకున్న టైమ్‌కి నిశ్చితార్థాన్ని పూర్తి చేసుకొని, బాబా-గురుదేవులకి నైవేద్యం, ఆరతి ఇచ్చి, కొంతసేపు సంతోషంగా గడిపి, రాత్రి ఎనిమిది గంటలకల్లా తిరిగి తెనాలి చేరాము. గురువుగారు ఇచ్చిన ఈ అనుభవం గురించి ఆలోచిస్తే ఆయన రక్షణ ఎంతగా నా కుటుంబం మీద ఉందని నాకు అర్థం అయింది. ఆలోచిస్తే, బంధువులు, చుట్టుప్రక్కల వాళ్లు, చిన్నపిల్లలు ఇంత మందికి కలిగిన ఇబ్బంది అంటే మనోహర్ నిశ్చితార్థానికి వెళితే బస్ మూలంగా బాగా ఇబ్బంది పడ్డామని బంధువులు, చుట్టుప్రక్కల వాళ్లు అనుకోకుండా, చిన్న పిల్లలు ఆకలితో ఇబ్బంది పడి శోకాలు పెట్టకుండా, మా గురించి ఎదురుచూస్తున్న మా మామగారు, అత్తగారు, సుప్రజ, వాళ్ల బంధువులు, మరియు ఎంతో కష్టపడి ప్రేమతో సుప్రజ వాళ్లకి సహాయం చేస్తున్న సంతనూతలపాడు గురుబంధువులు, వీళ్లందరూ నిరాశ చెందకుండా, ఖాళీ బస్‌ను పంపి, మమ్మల్ని సమయం మించి పోకుండా కార్యక్రమానికి చేర్చి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకున్న గురుదేవుల కరుణ, ప్రేమ, రక్షణ గురించి ఆలోచిస్తే ఈ జీవితానికి ఇంక ఎవ్వరూ అక్కర్లేదు. బాబా-గురుదేవులు చాలు అని అనిపిస్తుంది. చివరగా గురుదేవుల ఆరాధనోత్సవాలకు





ముందు ఆరు ఆదివారాలు ఉదయం ఎనిమిదిగంటల నుండి సాయంత్రం ఎనిమిదిగంటల వరకు సాయిఊసు, సాయిధ్యాస కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతోంది. ఆ కార్యక్రమంలో ఒకరోజు సాయినామం చెప్తూ గురుదేవుల గురించి ఆలోచిస్తుండగా ఆయన నాకు ఇచ్చిన ఒక స్వప్నానుభవంలోని భావం నాకు అర్థం అయింది. ఐదు సంవత్సరాల క్రితం స్వప్నంలో నేను ఆయనతో ఒక మాట అన్నాను. “ నా నోట్లో నుండి బాబా నామం వస్తుంది కానీ మనసులో ఏమీ లేదు గురువుగారు” అని. ఈ రోజున నాకు అర్థం అయింది పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ చేసేది ఆ ఖాళీని నింపడం అని. నాకు ప్రమోద్ మోడీ పాడేటటువంటి ఒక పాటలో రెండు చరణాలు అంటే చాలా ఇష్టం. Sai Tere Charanome అనే ఆల్బమ్‌లో ఒక పాటలో ఆయన బాబా గురించి Tere Naam pe Jeena Hai! Tere Naam pe Marna Hai! అని పాడతారు. అది విన్నప్పుడల్లా నా హృదయంలో బలంగా ఒకటే అనిపిస్తుంది. బ్రతికితే బాబా-గురుదేవుల పేర్లు చెప్పుకొని బ్రతకాలి, చనిపోతే బాబా-గురుదేవుల పేర్లు చెప్పుకొని చావాలని.

నేను చేస్తున్న తప్పులను ఎప్పటిలాగే మన్నిస్తూ, నన్ను వారికి మరియు బాబాకి మరింత దగ్గర చేయాలని మనస్ఫూర్తిగా పూజ్య గురుదేవులను అర్థిస్తూ ఎప్పుడూ వారి పాదాల వద్ద విశ్వాసంగా ఉండే శక్తిని ప్రసాదించమని వేడుకుంటూ....

*- మనోహర్, హైదరాబాద్*

సత్యాన్ని ఎఱుకపరచి సత్యమునే అంటిపెట్టుకునే సాంగత్యమునిచ్చి
స్వధర్మాన్ని తెలిపి ధర్మబద్ధులను కావించి
పెడత్రోవ పడుతున్న భక్తికి అర్థం తెలిపి వివేకయుతంగా నడిపి
జీవితంలోకి ఎందుకొచ్చింది అని ప్రశ్నించి
జీవించడం అంటే ఏమిటో తమ ఆచరణతో తెలిపి, నిలిపి, నడిపి
ధన్యతనిచ్చి చరితార్థులను చేయడానికే భగవంతుడు
గురురూపంలో లీలామానుషునిగా అవతరించుచున్నది.

-గురుకృప





# సమాధి

**పూజ్య శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ**

"సమాధి" అనే పదానికి వేర్వేరు అర్థాలున్నాయి. వ్యవహారిక భాషలో – మరణించిన వ్యక్తి యొక్క స్మారక కట్టడం – గోరీని 'సమాధి' అని వ్యవహరిస్తారు. మరొక అర్థం – మన అవసరాలన్నీ నెరవేరి, మన సంతృప్తి కోసం చేసే అన్వేషణకు సమాధానం దొరికే ఒకానొక స్థితిని 'సమాధి' అంటారు.

'సమాధి'కి ఉన్న మూడవ అర్థం – విరుద్ధమైన భావోద్రేకాల తీవ్రతలేమీ లేకుండా, వాటి మధ్య పరిపూర్ణ భావసమన్వయం ఏర్పడి, సంపూర్ణంగా లీనమైన అనుభవం కలిగే మనఃస్థితి ఒకటుంటుంది. మనస్సు యొక్క ఆ చైతన్యస్థితిని 'సమాధి' అంటారు. బాబా ఆ చైతన్యస్థితిలో మహాసమాధిలో ఉన్నారు. బాహ్యంగా మనకు కనిపించేది బాబా యొక్క 'సమాధి'. మనం బాబా సమాధి చెంతకు వెళ్లినపుడు మనకు అనుభవమయ్యేది 'సమాధి' – అంటే అక్కడ మన అవసరాలు సమాధానపడతాయి. అందుకే 'సమాధి సమాధానమిస్తుంది' అన్నారు బాబా. బాబా ఉన్న ఆ పరిపూర్ణ స్థితి – 'సమాధి' – ప్రజల యొక్క వివిధ అవసరాలకు సమాధానమిస్తుంది. ఆ విధంగా, బాబా సమాధి విషయంలో పై అర్థాలన్నీ సరిపోతాయి. – ***శ్రీబాబూజీ***

## SAMADHI

Connotatively, the word samadhi has several meanings. The first meaning is a tomb; the tomb of any person can be called a samadhi, so one meaning is 'tomb'. 'Samadhi' also means a state of samadhana, a state where all our quest for concretisation of our abstract sense of fulfilment is answered. That is why, if you ask what samadhi means, the answer is 'samadhanam', that state where all our needs are answered, where you feel all your needs are fulfilled; this is the second meaning of samadhi. The third meaning is that state of mind where you become so much absorbed within, without any conflicting intellectual or emotional pulls, that all your emotions become totally harmonised. That blissful state is also called samadhi.

The right meaning of 'samadhi' is where you experience that all your needs are answered completely so that no grounds for conflict can arise again- here the matter ends! There are no further needs or desires to be answered, so there are no seeds for future conflict. In the ordinary biological sense death answers or fulfills the physical need for life, so a tomb is called a samadhi. But in the spiritual sense, samadhi is the name given to that state where all our spiritual needs are answered and get fulfilled; where you experience that your abstract ideal of fulfilment has become totally concretised- that is samadhi. [Guruji laughs]. But people do not know all these meanings, or that they can use samadhi in these different ways: that Baba is in samadhi- that state of consciousness; that what we see concretely is his tomb, his samadhi; and when we go there what we get is samadhi, where our needs are answered. So in all these senses it has meaning. That is why Baba said, "My samadhi will answer!" His state of fulfilment will answer the needs of the people, all their various needs for fulfilment. It is the samadhi which answers our needs.





## మరువగలమా!

మరువగలమా! మరువగలమా!
తన తనువును అందరికీ అర్పించిన
అణువణువూ విశ్వాత్మకు సమర్పించిన
విశాలాత్మను... పవిత్రాత్మను... ॥మరువ॥
చదువు నుండి విద్యకు, విద్య నుండి ఆత్మవిద్యకు
హక్కు నుండి బాధ్యతకు, బాధ్యతలో ఆధ్యాత్మికతకు
స్వార్థము నుండి త్యాగమునకు, దారి చూపిన వారిని ॥మరువ॥
ఎవరికేమి చెప్పాలో అది చెప్పేవారిని
ఎవరికేమి చెయ్యాలో అది చేసేవారిని
ఎవరికేది ఇవ్వాలో అది ఇచ్చేవారిని ॥మరువ॥
జీవితమునే చేయును సమగీతము
తెలుపును మానవజన్మ మహిమము
కర్మరహితము నుపదేశించిన వారిని ॥మరువ॥
నిత్యము వెదజల్లు కరుణారసము
ఆత్మ జల్లుమనిపించు హాస్యము
హాస్యములో వ్యక్తమగు రహస్యము ॥మరువ॥
కలికాలమున చూపించు నవ్యలీలలు
కలకాలము చూపించు దివ్య కళలు
చెప్పలేని అనుభూతులు చెబుదామనుకుంటే
వ్రాయలేని అనుభవాలు వ్రాద్దామనుకుంటే
ఏమని చెప్పాలి, ఏమని వ్రాయాలి
అదంతా ఆనందస్థితి, అనంతమైన రసానుభూతి ॥మరువ॥
మరువలేము! మరువలేము!!
తన తనువును అందరికీ అర్పించిన
అణువణువూ విశ్వాత్మకు సమర్పించిన
విశాలాత్మను, పవిత్రాత్మను మరువలేము, మరువలేము



*-సత్తిబాబు, విశాఖ*

అందరి ఆర్తనాదములు ఆలకించి అనుగ్రహించుటకు! ఎందరు ఎన్ని విధముల మొర పెట్టిననూ విసుగులేక వినగలవాడవు, వినువాడవు నీవే!














రారాజని - హాలికుడన్ని, పూజ్యుడని - పామరుడన్ని, కలవాడని - కూలీవాడని - నీకేమియూ భేధము లేదు. నీ ఆశ్రితులందరూ నీ బిడ్డలు. నీ బిడ్డడు ఎట్టి బాధయందున్ననూ అప్రమత్తుడవై, పరుగెత్తి, బాధ్యత నీపై వైచుకుని అండయై నిలిచెదవు. అసాధ్యమన్నది కూడా సాధ్యము చేసెదవు. ఇది నీ సహజ స్వభావము. అందుకే నీవు భక్త రక్షణా పరతంత్రుడవు.


కనులలో మీ రూపం - దర్శనంగా...
మదిలో మీ స్వరూపం - సందర్శనంగా... నిలవగా
అంతటా మిము కాంచగలము...


తలచినంతనే దర్శన మిచ్చెదనన్న నా తండ్రి ఎచ్చటికో పోయెనని పొరబడనులే!